1st Year Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
RNI : APTEL / 2023 / 89152
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక



Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 3 సంచిక : 84 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ ఆదివారం 29 మార్చి 2026 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు,నెల్లూరు

VOLUME : 03 ISSUE : 84 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE,NELLORE Sunday 29 March 2026 PAGES : 8 PRICE : 3/-

## జగన్ హయాంలోనే అమరావతిలో రోడ్ల నిర్మాణం జరిగింది: పేర్ని నాని



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 28)
రాజధాని అమరావతిని చంద్రబాబు అప్పులకుప్పగా మార్చారని, కాంట్రాక్టర్ల దోపిడీ కోసం దీనిని ఒక 'ఏటీఎమ్'లా వాడుకుంటున్నారని మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నాని మండిపడ్డారు. ఇప్పటివరకు ఖర్చు చేసిన రూ. 21 వేల కోట్లపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ▶మిగతా 2లో

## అమరావతిపై జగన్ మాట మార్చారు: నారాయణ



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 28)
అసెంబ్లీ సాక్షిగా అమరావతినే రాజధానిగా అంగీకరించిన జగన్... అధికారంలోకి వచ్చాక మాట మార్చి 'మూడు రాజధానుల' పేరుతో ప్రజల్లో భయాందోళనలు సృష్టించారని మంత్రి నారాయణ మండిపడ్డారు. చంద్రబాబు నాయకత్వంపై నమ్మకంతో అమరావతి కోసం రైతులు 34 వేల ఎకరాలను స్వచ్ఛందంగా ఇచ్చారని, కానీ గత ప్రభుత్వం వారి ఆశయాలను కాలరాసిందని ▶మిగతా 2లో

## శాంతి కావాలంటే..మేం చెప్పినట్లు వినాలి: గల్ఫ్ దేశాలకు ఇరాన్ హెచ్చరిక




(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,మార్చి 28)
అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడుల నేపథ్యంలో ఇరాన్ కూడా గల్ఫ్ దేశాల పై విరుచుకుపడుతోంది. ఈ క్రమంలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ తమ పొరుగు దేశాలకు హెచ్చరికలు చేశారు. గల్ఫ్ దేశాల్లో దాడులు ఆగాలన్నా.. శాంతి, అభివృద్ధి నెలకొనాలన్నా తాము చెప్పినట్లు వినాలన్నారు. ఆయా దేశాల గగనతలాలను వినియోగించుకొని శత్రువులు తమపై దాడి చేస్తున్నారన్నారు. తమ గగనతలాలను వినియోగించుకోవడానికి అమెరికా, ఇజ్రాయెల్‌లకు అనుమతి ఇవ్వొద్దని బహ్రెయిన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, జోర్డాన్, ఇతర పశ్చిమాసియా దేశాలకు సూచించారు.

తాము ఏ దేశంపైనా ముందస్తు దాడులు చేయబోమని అనేక సార్లు స్పష్టం చేసినట్లు పెజెష్కియాన్ పేర్కొన్నారు. కానీ తమ మౌలిక సదుపాయాలు, అణు, ఆర్థిక కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటే మాత్రం చూస్తూ ఊరుకోబోమని.. ప్రతీకారం తీర్చుకుంటామన్నారు. శత్రు స్థావరాలు భూస్థాపితం అయ్యే వరకు దాడులు కొనసాగిస్తామన్నారు. శత్రువులకు సహకరించిన వారిని కూడా వదలబోమన్నారు.

హర్మూజ్‌ను దాటిన మరో రెండు భారత నౌకలు

భారత్ సహా తమ మిత్రులైన ఐదు దేశాల నౌకల కోసం హర్మూజ్ జలసంధిని తెరుస్తున్నట్లు ఇరాన్ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఎల్పీజీని మోసుకొస్తున్న మరో రెండు భారత నౌకలు శనివారం హర్మూజ్ జలసంధిని ▶మిగతా 2లో

# ఏపీ రాజధాని అమరావతి.. ఎవరూ టచ్ చేయలేరు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 28)
ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధాని అమరావతేనని, దీనిని ఎవరూ తాకలేరని, అంగుళం కూడా కదిలించలేరని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. అమరావతికి సంపూర్ణ చట్టబద్ధత కల్పించడం ద్వారా భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలనే లక్ష్యంతో, శాసనసభ ప్రత్యేక సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపారు. ఈ సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ.. అమరావతిపై గత ప్రభుత్వం చేసిన విధ్వంసాన్ని, ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యాలను సుదీర్ఘంగా వివరించారు.

### చారిత్రక నేపథ్యం.. తెలుగుజాతి ఆత్మగౌరవం

అమరావతికి వందల ఏళ్ల చరిత్ర ఉందని, శాతవాహనులు ఇక్కడి నుంచే పాలన సాగించారని చంద్రబాబు గుర్తు చేశారు. బ్రిటిష్ మ్యూజియంలో సైతం అమరావతి గ్యాలరీ ఉండటమే దీని ప్రాశస్త్యానికి నిదర్శనమని అన్నారు. పొట్టి శ్రీరాములు త్యాగంతో ఏర్పడిన ఆంధ్రరాష్ట్రానికి అప్పుడే విజయవాడను రాజధాని చేసి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని అభిప్రాయపడ్డారు. ఒకప్పుడు తెలుగువారిని 'మదరాసీలు' అని పిలిచేవారని, ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించి తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని నిలబెట్టారని తెలిపారు. పీవీ నరసింహారావు తెచ్చిన ఆర్థిక సంస్కరణలను అందిపుచ్చుకుని తెలుగువారు ప్రపంచవ్యాప్తంగా రాణించారని, తాను సైబరాబాద్ నిర్మించడం వల్లే నేడు తెలంగాణ ఆదాయంలో హైదరాబాద్ కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు.

### మూడు రాజధానుల కుట్ర.. జగన్‌పై చంద్రబాబు ఫైర్

ఎన్నికలకు ముందు అమరావతికి జై కొట్టిన జగన్ మోహన్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక మాట మార్చి మూడు రాజధానుల నాటకానికి తెరలేపారని చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. 'ఒక్క ఛాన్స్' పేరుతో అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని 30 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లారని ఆరోపించారు. ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంస పాలన మొదలుపెట్టారని, అమరావతిని శ్మశానం, ఎడారి, ముంపు ప్రాంతం, వేశ్యల రాజధాని అంటూ దుష్ప్రచారం చేసి ప్రజల్లో విషం నింపారని మండిపడ్డారు. మూడు రాజధానుల బిల్లును శాసన మండలి తిరస్కరించి సెలెక్ట్ కమిటీకి పంపితే, నిబంధనలకు విరుద్ధంగా గవర్నర్‌కు పంపి చట్టం చేయాలని చూశారని, కానీ హైకోర్టు జోక్యంతో రాజధానిని కాపాడుకోవాల్సి వచ్చిందని గుర్తు చేశారు.

### రైతుల త్యాగం.. 1631 రోజుల పోరాటం

రాజధాని కోసం రైతులు స్వచ్ఛందంగా 33 వేల ఎకరాల భూమిని శాంతియుతంగా ప్రభుత్వానికి ఇచ్చారని, ప్రపంచంలో ఎక్కడా ఇలాంటి ల్యాండ్ పూలింగ్ జరగలేదని ▶మిగతా 2లో

## ఆ రోజు నా చేతిలో తుపాకీ ఉంటే కాల్చిపడేయాలనిపించింది



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 28)
గత ప్రభుత్వ హయాంలో సభలో చంద్రబాబుకు, తమకు జరిగిన అవమానాలు చూశాక.. తన దగ్గర తుపాకీ ఉంటే కాల్చిపడేసే వాడిని అనిపించేంత ఆవేదన, కోపం కలిగాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతిని ఖరారు చేస్తూ శాసనసభలో ప్రవేశపెట్టిన తీర్మానంపై జరిగిన చర్చలో ఆయన ప్రసంగించారు. గత వైసీపీ ప్రభుత్వంలో మూడు రాజధానుల బిల్లును మండలిలో అడ్డుకున్న సమయంలో చోటుచేసుకున్న పరిణామాలను గుర్తుచేసుకుంటూ ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆ తిట్లు పడటానికే రాజకీయాల్లోకి వచ్చామా అని ఆ రోజు ఆవేదన చెందానని అన్నారు.

గన్నుంటే కాల్చేయాలనిపించింది

గత ప్రభుత్వంలో మూడు రాజధానుల బిల్లును శాసనమండలిలో ప్రవేశపెట్టిన రోజు జరిగిన ఘటనలను అచ్చెన్నాయుడు పూస గుచ్చినట్టు వివరించారు. "ఆ రోజు చంద్రబాబు గారిని, మమ్మల్ని అనరాని మాటలు అన్నారు. ఆ మాటలు వింటే నాలాంటోడికైతే గన్ను ఉంటే కాల్చేయాలి అనిపిస్తుంది. ఇంత దారుణమా? ఈ తిట్లు తినడానికేనా మనం రాజకీయాల్లో ఉన్నది? అనిపించింది. అయినా సరే, చంద్రబాబు గారు ఎంతో ఓపికతో నిలబడ్డారు. ఆయన ఓపికకు జోహార్లు. ఇది మన బాధ్యత అని మాకు ధైర్యం చెప్పారు" అని అచ్చెన్నాయుడు అన్నారు. ▶మిగతా 2లో

## అసెంబ్లీలో "జై అమరావతి" నినాదాలు చేసిన మంత్రి నారా లోకేశ్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 28)
ఆంధ్రప్రదేశ్ శాసనసభలో 'జై అమరావతి' నినాదాలు మార్మోగాయి. రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే తీర్మానంపై జరిగిన



చర్చలో ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన ప్రసంగం మధ్యలో ఈ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.రాజధానిగా అమరావతే ఉంటుందని అబద్ధం చెప్పి ముఖ్యమంత్రి అయ్యాక జగన్ మూడు ముక్కలాట ఆడారని ఆయన ఆరోపించారు. రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించిన కీలకమైన అంశంపై సభలో చర్చ జరుగుతుంటే జగన్ బెంగళూరులో ఉండటాన్ని లోకేశ్ తప్పుబట్టారు. ఇది వ్యక్తిగత విషయం కాదని, ఐదు కోట్ల ఆంధ్రుల భవిష్యత్తుకు సంబంధించినదని అన్నారు.గత ప్రభుత్వ హయాంలో అమరావతి రైతులు చేసిన ఆందోళనలకు సంబంధించిన ఫొటోలను లోకేశ్ సభలో ప్రదర్శించారు. ప్రజలను, రైతులను మోసం చేసినందుకు జగన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. 'ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ' తమ ప్రభుత్వ విధానమని లోకేశ్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. అమరావతి రాజధాని తీర్మానానికి తాను సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు స్పష్టం చేశారు.

## బెంగాల్ టీఎంసీ ప్రభుత్వంపై అమిత్ షా 'ఛార్జ్‌షీట్'



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,మార్చి 28)
పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల వేళ.. టీఎంసీ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ కేంద్రమంత్రి అమిత్ షా 'ఛార్జ్‌షీట్' విడుదల చేశారు. 15 ఏళ్ల టీఎంసీ ▶మిగతా 2లో

## యుద్ధ సవాళ్లను దీటుగా ఎదుర్కొంటున్నాం: మోదీ

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,మార్చి 28)
పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఎదురవుతోన్న సవాళ్లను భారత్ పూర్తి శక్తితో ఎదుర్కొంటోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. శనివారం ఉత్తర్‌ప్రదేశ్‌లోని నొయిడాలో పూర్తయిన అంతర్జాతీయ



విమానాశ్రయం తొలి దశను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. పశ్చిమాసియాలోని పరిస్థితిని ప్రపంచమంతా గమనిస్తోందని మోదీ అన్నారు. అక్కడ గత నెల రోజులుగా భీకర పోరు కొనసాగుతోందన్నారు. ఈ సంఘర్షణ కారణంగా.. ఆహారం, ఇంధనం, గ్యాస్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడిందని ఆందోళన వ్యక్తంచేశారు. అనేక దేశాల్లో నిత్యావసర సరకుల కొరత ఏర్పడిందన్నారు. ▶మిగతా 2లో

## అసెంబ్లీలో అమరావతి తీర్మానం వేళ పవన్ కల్యాణ్ భావోద్వేగ ప్రసంగం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 28)
రాష్ట్ర విభజన జరిగిన కొత్తలో చంద్రబాబును కలిసినప్పుడు, "టెంట్ వేసుకునైనా ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేద్దాం" అని ఆయన అన్న మాటలు తనను ఎంతగానో ప్రభావితం చేశాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గుర్తుచేసుకున్నారు. అనుభవజ్ఞుడైన నేత చేతిలో రాష్ట్రం ఉంటేనే భవిష్యత్తు బాగుంటుందనే ఉద్దేశంతోనే, 2014లో ఎటువంటి షరతులు లేకుండా తాను మద్దతు ఇచ్చానని



ఆయన స్పష్టం చేశారు. చంద్రబాబు ఒక బలమైన ఆశావాదిలా పనిచేశారని కొనియాడారు.

సాధారణంగా భూసేకరణ అంటే ఎన్నో గొడవలు, అడ్డంకులు ఉంటాయని, కానీ అమరావతి కోసం రైతులు ఎటువంటి గొడవలు లేకుండా స్వచ్ఛందంగా భూములివ్వడం ఒక గొప్ప విషయమని పవన్ పేర్కొన్నారు. రాజధాని కోసం భూములిచ్చిన వారందరికీ న్యాయం చేసేలా అప్పట్లోనే అడుగులు ▶మిగతా 2లో

మొదటి పేజీ తరువాయి

# ఏపీ రాజధాని అమరావతి.. ఎవరూ టచ్ చేయలేరు

చంద్రబాబు అన్నారు. అలాంటి రైతులపై గత ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందని, అక్రమ కేసులు బనాయించి, మహిళలని కూడా చూడకుండా జుట్టు పట్టుకుని ఈడ్చి, కాళ్లతో తన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు 1,631 రోజుల పాటు చారిత్రాత్మక పోరాటం చేశారని, 'న్యాయస్థానం నుంచి దేవస్థానం వరకు' పాదయాత్రతో తమ ఆవేదనను తెలియజేశారని కొనియాడారు. వైసీపీ అమరావతికి, ఆంధ్రప్రదేశ్‌కు ద్రోహం చేసిందని, అందుకే ప్రజలు 151 సీట్ల నుంచి 11 సీట్లకు పరిమితం చేశారని వ్యాఖ్యానించారు.

**2028 నాటికి అమరావతి పూర్తి.. పనుల పునఃప్రారంభం**

ప్రజాతీర్పుతో రాష్ట్రానికి మళ్లీ మంచి రోజులు ప్రారంభమయ్యాయని చంద్రబాబు అన్నారు. అమరావతి పనులు ఇప్పటికే పునఃప్రారంభమయ్యాయని, దాదాపు రూ.56 వేల కోట్ల విలువైన 91 పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. 2028 నాటికి అమరావతిలో ప్రధాన నిర్మాణాలు పూర్తి చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. ట్రంక్ రోడ్లు 2027 మే నాటికి, అసెంబ్లీ, హైకోర్టు, ఐకానిక్ టవర్లు 2028 ఆగస్టు నాటికి పూర్తి చేసి ప్రధానమంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తామని వెల్లడించారు. శంకుస్థాపన చేసిన నగరంలో పనులు ఆగిపోయి, మళ్లీ పునఃప్రారంభించడం చరిత్రలో అమరావతిలోనే జరిగిందని అన్నారు.

**విధ్వంసకారులకు హెచ్చరిక.. మూడు ప్రాంతాల అభివృద్ధికి హామీ**

అమరావతి పనులు వేగవంతం అవుతున్న తరుణంలో ఇటీవల వరుసగా జరుగుతున్న అగ్నిప్రమాదాలపై చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనలపై దర్యాప్తునకు సిట్ ఏర్పాటు చేశామని, అమరావతిలో ఎవరైనా విధ్వంసానికి పాల్పడాలని చూస్తే అది వారికి చివరి రోజవుతుందని గట్టిగా హెచ్చరించారు. తమ ప్రభుత్వ విధానం 'ఒకే రాజధాని – అన్ని ప్రాంతాల అభివృద్ధి' అని పునరుద్ఘాటించారు. విశాఖపట్నం, అమరావతి, తిరుపతి రీజియన్లను మెగా నగరాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. విశాఖలో డేటా సెంటర్, అనకాపల్లిలో స్టీల్ సిటీ, రామాయపట్నం పోర్టు వంటి ప్రాజెక్టులతో అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.

# జగన్ హయాంలోనే అమరావతిలో రోడ్ల నిర్మాణం జరిగింది: పేర్ని నాని

అసెంబ్లీలో ప్రవేశపెట్టిన చట్టబద్ధత తీర్మానం కేవలం ఒక 'డ్రామా' అని, శాసనమండలి ఆమోదం లేకుండా కేవలం అసెంబ్లీ తీర్మానంతో చట్టబద్ధత ఎలా వస్తుందని ఆయన ప్రశ్నించారు. కూటమి నేతలు కేవలం జగన్‌ను తిట్టడానికే సమయాన్ని వృథా చేశారని ఆరోపించారు.

నిజానికి జగన్ హయాంలోనే అమరావతిలో రోడ్ల నిర్మాణం జరిగిందని, ఆయనకు రాజధానిపై కోపం ఉంటే తాడేపల్లిలో ఇల్లు ఎందుకు కట్టుకుంటారని నాని నిలదీశారు. అమరావతిలో పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలను రద్దు చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం రాజధానిపైనే కాకుండా, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, కడప స్టీల్ ప్లాంట్, విశాఖ ఉక్కుకు సొంత గనుల కేటాయింపు వంటి అంశాలపై అసెంబ్లీలో తీర్మానాలు చేయాలని కూటమి ప్రభుత్వానికి ఆయన సవాల్ విసిరారు. అప్పుడే ప్రభుత్వానికి రాష్ట్రంపై చిత్తశుద్ధి ఉందని నమ్ముతామని స్పష్టం చేశారు.

# అమరావతిపై జగన్ మాట మార్చారు: నారాయణ

విమర్శించారు. శివరామకృష్ణ కమిటీ రాజధాని ఎంపికను రాష్ట్రానికే వదిలేసిందని, దాని ఆధారంగానే అమరావతిని ఎంపిక చేశామని గుర్తుచేశారు.గతంలోనే రూ. 41,170 కోట్లతో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించినా, వైసీపీ ప్రభుత్వం వాటిని నిలిపివేసి రాష్ట్రానికి నష్టం చేకూర్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అమరావతిని 9 ప్రత్యేక నగరాలు (జస్టిస్, మీడియా, హెల్త్ సిటీ వంటివి), 23 టౌన్‌షిప్‌లతో ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. నిలిచిపోయిన భవనాల నాణ్యతను పరిశీలించి, పనులను అత్యంత వేగంగా పూర్తి చేస్తామని నారాయణ స్పష్టం చేశారు.

# శాంతి కావాలంటే..మేం చెప్పినట్లు వినాలి: గల్ఫ్ దేశాలకు ఇరాన్ హెచ్చరిక

సురక్షితంగా దాటినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. 90,000 టన్నులకు పైగా ఎల్పీజీ (వంటగ్యాస్)ని తీసుకువస్తున్న బీడబ్ల్యూ ఈఎల్ఎం, బీడబ్ల్యూ టీవైఆర్ అనే రెండు నౌకలు హర్మూజ్‌ను దాటి అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించాయన్నాయి. మరో ఐదు భారతీయ ట్యాంకర్లు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సమీపంలోని జలాల్లో ఇరాన్ అనుమతి కోసం వేచి ఉన్నట్లు తెలుస్తోంది.

# బెంగాల్ టీఎంసీ ప్రభుత్వంపై అమిత్ షా 'ఛార్జ్‌షీట్'

దుష్పరిపాలన, బెంగాల్‌ను ఆ పార్టీ అవినీతిమయంగా ఎలా మార్చిందనే విషయాలను ఆ ఛార్జ్ షీట్‌లో పేర్కొన్నారు. గత 15 ఏళ్లుగా బెంగాల్‌లో అవినీతి, బుజ్జగింపు రాజకీయాలు నడుస్తున్నాయని..శాంతి భద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయని అన్నారు. టీఎంసీ ఓటు బ్యాంకు రాజకీయాల వల్ల సిలిగుడి కారిడార్ భద్రతకు ముప్పు వాటిల్లిందని ఆరోపించారు. గతంలో అస్సాంలోనూ చొరబాటుదారులు ప్రవేశించేవారని.. భాజపా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అక్కడ చొరబాట్లు ఆగిపోయాయని అమిత్ షా అన్నారు. ప్రస్తుతం కేవలం బెంగాల్ నుంచే భారత్‌లోకి చొరబాటుదారులు ప్రవేశిస్తున్నారని ఆరోపించారు. దేశ భద్రతకు ఇది ఆందోళనకరంగా మారిందన్నారు. కోర్టు ఆదేశాల తర్వాత కూడా బార్డర్ ఫెన్సింగ్ కోసం బీఎస్ఎఫ్‌కు టీఎంసీ ప్రభుత్వం భూమిని కేటాయించట్లేదని ఆరోపించారు. రాష్ట్ర పోలీసులు, అధికారులు అక్రమ వలసలను అడ్డుకోకపోవడం వల్ల వారు నకిలీ పత్రాలతో బెంగాల్ ద్వారా దేశంలోని అన్ని రాష్ట్రాల్లోకి వస్తున్నారన్నారు. వారిని అడ్డుకోవడానికి బదులుగా చొరబాటుదారుల ఓట్లు పోతాయనే భయంతో మమత 'సర్' ప్రక్రియపై, ఎన్నికల కమిషన్‌పై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. బెంగాల్‌లో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే చొరబాట్లను అరికట్టడానికి కఠిన చర్యలు తీసుకుంటామని..సరిహద్దు కంచె వేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు.

# ఆ రోజు నా చేతిలో తుపాకీ ఉంటే కాల్చిపడేయాలనిపించింది

**ప్రజాస్వామ్యానికి చీకటి రోజు**

మూడు రాజధానుల బిల్లును శాసన మండలిలో ప్రవేశపెట్టిన 2020, జనవరి 21వ తేదీని ప్రజాస్వామ్యానికి చీకటి రోజని అచ్చెన్నాయుడు అభివర్ణించారు. "శాసన మండలిలో మాకు బలం ఉన్నా, వైఎస్సార్సీపీకి కేవలం 8 మంది సభ్యులే ఉన్నా.. బిల్లును అడ్డగోలుగా పాస్ చేయాలని చూశారు. మంత్రులు, ఎమ్మెల్యేలందరూ మండలిలోకి వచ్చేశారు. లైట్లు ఆపేశారు, టీవీ ప్రసారాలు నిలిపేశారు. చైర్మన్ షరీఫ్ గారి ఛాంబర్‌ను విజయసాయి రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి వంటి వారు చుట్టుముట్టి తీవ్ర ఒత్తిడి తెచ్చారు. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ చైర్మన్ గారు ధైర్యంగా నిలబడి బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపి రాష్ట్రాన్ని బతికించారు" అని ఆయన వివరించారు.

**2019లో ప్రజలు తప్పు చేశారు**

2019 ఎన్నికల్లో ప్రజలు చారిత్రక తప్పిదం చేశారని అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. "2014-19 మధ్య చంద్రబాబు పాలన ఈ రాష్ట్రానికి ఒక స్వర్ణయుగం. అన్ని జిల్లాలను అభివృద్ధి చేస్తూ, సంక్షేమాన్ని అందిస్తూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లాం. అయినా ప్రజలు మమ్మల్ని ఎందుకు ఓడించారో అర్థం కాలేదు. ఎవరో కొత్తగా ఆకాశం నుంచి దిగివచ్చి పార్టీ పెడితే నమ్మి ఓటేస్తే ఫర్వాలేదు. కానీ తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని లక్ష కోట్లు దోచుకుని, 16 నెలలు జైల్లో ఉన్న ఒక దొంగకు ఓటు వేశారనేదే నా బాధ" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**మూడు రాజధానుల పేరిట చిచ్చు**

గత ముఖ్యమంత్రి జగన్ మూడు రాజధానుల పేరుతో ప్రాంతాల మధ్య, కులాల మధ్య చిచ్చు పెట్టారని అచ్చెన్నాయుడు ఆరోపించారు. "విశాఖపట్నాన్ని రాజధాని చేస్తామని చెప్పి ఐదేళ్లలో ఏం ఉద్ధరించారు? ఒక్క ఇటుక కూడా వేశారా? కేవలం ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలతో ఆడుకున్నారు. మేము అమరావతే రాజధాని అని ఎన్నికలకు వెళ్లాం, ఆ మాటకు కట్టుబడి ఉన్నాం. రాజధాని పేరుతో అమరావతి రైతులను, రాష్ట్రాన్ని నాశనం చేశారు. ఒక శిల్పిలా చంద్రబాబు గారు రాజధానిని చెక్కుతుంటే.. ఒక దుర్మార్గుడు వచ్చి సర్వనాశనం చేశాడు" అని ఆయన విమర్శించారు.

**అమరావతికి చట్టబద్ధత.. ప్రజలకు విజ్ఞప్తి**

అమరావతి రాజధాని నిర్మాణానికి చంద్రబాబు గారు కారకుడు, కర్త, క్రియ అని అచ్చెన్నాయుడు అన్నారు. "భవిష్యత్తులో మళ్లీ ఎవరైనా పిచ్చోడి చేతికి రాయి దొరికినట్టు, రాజధానిని మార్చాలని ప్రయత్నించకూడదనే ఉద్దేశంతోనే ఈరోజు ఈ తీర్మానం చేస్తున్నాం. దీనికి చట్టబద్ధత కల్పించి కేంద్రానికి పంపుతున్నాం. ప్రజలారా.. మళ్లీ వైకుంఠపాళి ఆట ఆడొద్దు. ప్రలోభాలకు లొంగి మళ్లీ తప్పు చేస్తే ఈ రాష్ట్రాన్ని ఎవ్వరూ బాగుచేయలేరు. మీ భవిష్యత్తు కోసం పనిచేస్తున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్, ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి" అని ఆయన ప్రజలకు చేతులు జోడించి విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నట్లు తెలిపారు.

# యుద్ధ సవాళ్లను దీటుగా ఎదుర్కొంటున్నాం: మోదీ

ప్రతి దేశం ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందని తెలిపారు. దీనినుంచి దేశాన్ని రక్షించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజలు, రైతులపై యుద్ధ భారం పడకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. సంక్షోభ సమయంలో కూడా ఎలాంటి అంతరాయం లేకుండా దేశంలో అభివృద్ధి కొనసాగుతోందన్నారు. ఇక, ఇలాంటి సమయంలో ప్రజలు ఐక్యతతో ఉండాలని, ప్రశాంతతను పాటించాలని మోదీ పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతోన్న ఇంధన సంక్షోభాన్ని ప్రస్తావిస్తూ.. ఈ విషయంపై ప్రజలను భయాందోళనకు గురిచేసే తప్పుడు ప్రచారాలు చేయొద్దని రాజకీయ పార్టీలను కోరారు. తమ ప్రభుత్వ విధానాలు.. దేశం, ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగానే ఉంటాయన్నారు.నోయిడాలోని జేవర్ ప్రాంతంలో పీపీపీ పద్ధతిలో రూ. 11,200 కోట్లతో ఈ విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నారు. అధునాతన నావిగేషన్ సిస్టమ్స్ సాయంతో, 3,900 మీటర్ల పొడవైన ఈ విమానాశ్రయ రన్‌వేపై అతిపెద్ద విమానాలు కూడా రాకపోకలు సాగించే వీలుంది. సరకు రవాణా కోసం కార్గో-లాజిస్టిక్ జోన్లను అనుసంధానం చేస్తూ మల్టీమోడల్ కార్గో హబ్‌నూ నిర్మించారు.

# అసెంబ్లీలో అమరావతి తీర్మానం వేళ పవన్ కల్యాణ్ భావోద్వేగ ప్రసంగం

పడ్డాయని ఆయన వివరించారు. 2019లో ప్రభుత్వం మారిన తర్వాత అమరావతిపై అభాండాలు వేశారని, రాజధాని మహిళా రైతులను రోడ్లపై దారుణంగా కొట్టారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడూ ఇల్లు వదిలి బయటకు రాని ఆడవాళ్లు సైతం రాజధాని కోసం రోడ్డుపైకి వచ్చి పోరాడాల్సిన దుస్థితి కల్పించారని మండిపడ్డారు. గత పాలనలో చట్టసభల్లో దాడులు జరిగాయని, ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబుకే రక్షణ లేని 'యుద్ధ వాతావరణం' ఉండేదని ఆయన గుర్తుచేశారు.రాష్ట్రాన్ని విభజించినప్పుడు కాంగ్రెస్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిందని, దాని వల్లే ఇప్పటికీ రాజధాని కోసం కొట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని పవన్ విమర్శించారు. "తెలంగాణ, ఆంధ్ర వేర్వేరు అనే భావన మాకు ఎప్పుడూ లేదు.. మా దృష్టిలో తెలుగు నేల ఒక్కటే" అని ఆయన ప్రకటించారు. అమ రావతికి కల్పిస్తున్న ఈ చట్టబద్ధత భవిష్యత్తు తరాలకు ఒక భరోసా అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# పారిశ్రామిక అవసరాలకు తగినట్లుగా యువతకు నైపుణ్యం కల్పించేలా చర్యలు

## జిల్లా కలెక్టర్ పి రాజాబాబు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 28)

పారిశ్రామిక అవసరాలకు తగినట్లుగా యువతకు నైపుణ్యం కల్పించేలా చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ పి రాజాబాబు చెప్పారు. కంపెనీల యాజమాన్యాలు కూడా ఈ దిశగా తమతో కలసి రావాలని ఆయన కోరారు. బీపీసీఎల్, ఇండో సోల్, జె.ఎస్.డబ్ల్యు కంపెనీలు, సెంచూరియన్ యూనివర్సిటీ అధికారులు, జిల్లాలోని మైన్స్ అసోసియేషన్ల ప్రతినిధులతో శనివారం క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఇప్పటికే ఉన్న పరిశ్రమలతో పాటు మరిన్ని కొత్తవి త్వరలో కార్యరూపం దాల్చబోతున్నందున స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, అదే సమయంలో పరిశ్రమల అవసరాలకు తగినట్లుగా యువతలోని నైపుణ్యాన్ని పెంపొందించడంపై అధికార యంత్రాంగం దృష్టి పెట్టినట్లు చెప్పారు. ఇందుకోసం ప్రత్యేక శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. తమ అవసరాలకు తగినట్లుగా యువతకు శిక్షణ ఇచ్చేలా పరిశ్రమలు కూడా ఇందులో భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. అలాగే ప్రతినిధులు కూడా తమ యూనిట్స్ ఏర్పాటుకు ముఖ్యంగా మైనింగ్, ఈ.వీ., సోలార్, పెట్రో కెమికల్ రంగాలకు సంబంధించిన వివరాలపై చర్చించారు. ఒంగోలులో త్వరగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను ఏర్పాటు చేయుటకు కలెక్టర్ ఈ సందర్భంగా కంపెనీల ప్రతినిధులకు, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి రవితేజ, బీపీసీఎల్ ప్రతినిధి వీరప్రసాద్, జెఎస్‌డబ్ల్యూ ప్రతినిధి కనకారావు, ఇండోసోల్ ప్రతినిధి రాజవర్ధన్, గ్రానైట్స్ అసోసియేషన్ ప్రతినిధులు లక్ష్మీ నారాయణ, సుభాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అమరావతే ఏకైక రాష్ట్ర రాజధానని అసెంబ్లీ తీర్మానం పై కాంగ్రెస్ పార్టీ హర్షం

## ఉమ్మడి ప్రకాశం జిల్లా డిసిసి అధ్యక్షులు షేక్ సైదా

(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, మార్చి 28)

అమరావతే ఏకైక రాష్ట్ర రాజధానిగా ఉండాలని శనివారం జరిగిన అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో తీర్మానం చేయడం పట్ల కాంగ్రెస్ పార్టీ హర్షం వ్యక్తం చేస్తుందని ఆంధ్రప్రదేశ్ సీసీ అధికార ప్రతినిధి, ఉమ్మడి ప్రకాశం జిల్లా డీసీసీ అధ్యక్షులు షేక్ సైదా అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీకి చెందిన11మంది సభ్యులు కూడా రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా అసెంబ్లీలో పెట్టే ఈ తీర్మానానికి మద్దతు తెలియజేయాలని కాంగ్రెస్ పార్టీ కోరుతుందన్నారు. ఈ ప్రత్యేక అసెంబ్లీ సమావేశంలో ఐదు కోట్ల ఆంధ్ర ప్రజానీకం ఆకాంక్షల మేరకు ఏపీకి ప్రత్యేక హోదా పై కూడా తీర్మానం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అలాగే కోట్లాది మంది గ్రామీణ పేదలకు ఉపాధి కల్పిస్తున్న మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని ఈ అసెంబ్లీ ప్రత్యేక సమావేశాల్లో తీర్మానం చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. ప్రస్తుతం తెచ్చిన కొత్త చట్టం వల్ల రాష్ట్రంలో కోట్లాది మంది గ్రామీణ పేదలు ఉపాధి కోల్పోవడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. డబల్ ఇంజన్, సర్కార్ ఎన్డిఏ కూటమి ప్రజల ఆకాంక్షల మేరకు బాధ్యతగా వ్యవహరించాలని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించాలని కాంగ్రెస్ పార్టీ కోరుతుందన్నారు. అధికారం, మంది బలం ఉందని విర్ర వీగితే వైసీపీకి పట్టిన గతే పడుతుందని ఆయన హెచ్చరించారు. ప్రస్తుత అసెంబ్లీ తీర్మానంలో ప్రజాభిప్రాయానుసారం పైన తెలిపిన విషయాలన్నిటి పై ప్రభుత్వం తీర్మానం చేసి ప్రజా ప్రభుత్వమనిపించుకోవాలని ఆయన హితవు పలికారు.


# దేశ ప్రయోజనాల కోసమే పెట్రోల్, డీజిల్ పై ఎక్సైజ్ డ్యూటీ తగ్గింపు

## మార్కెట్ యార్డ్ చైర్పర్సన్ నారిశెట్టి సుప్రజ




(షణ్ముఖ వెలుగు, బద్వేలు, మార్చి 28)

దేశ ప్రజలపై పెట్రోల్, డీజిల్ ధరల భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఎక్సైజ్ డ్యూటీ తగ్గింపు నిర్ణయం ప్రజాహిత దృష్టితోనే తీసుకున్నదని బద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నారిశెట్టి సుప్రజ తెలిపారు. ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధ ప్రభావం కారణంగా అంతర్జాతీయంగా ఇంధన ధరలు పెరుగుతున్న పరిస్థితుల్లో, ఆ ప్రభావం దేశ ప్రజలపై పడకుండా ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఆమె పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి నెలకొన్న వేళ, భారతదేశ ప్రజలు మరియు రైతాంగంపై అదనపు భారం పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సంశోభం కొనసాగుతున్నవేళ , భారత దేశ ప్రజల పై ఎటువంటి భారం పడకుండా నిరంతరం దేశ ప్రయోజనాలే అజెండాగా పనిచేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దూరదృష్టి, నాయకత్వ పటిమ దేశ ప్రజలకు, రైతాంగానికి శ్రీ రామ రక్ష అని ఆమె తెలిపారు.



ప్రకాశం



మార్కాపురం



బాపట్ల

షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

29.03.26 ఆదివారం


# జిల్లా అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తాం

## మీడియాతో నూతన కలెక్టర్ విజయ సునీత వెల్లడి

## హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాచారాలతో ప్రత్యేక ప్రార్ధనలు





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 28)**

నూతనంగా ఏర్పడిన మార్కాపురం జిల్లా అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని నూతన కలెక్టర్ ఎం విజయ సునీత వెల్లడించారు. మార్కాపురం కలెక్టరేట్లో శనివారం ఆమె నూతనంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రధానమైన వెలుగొండ ప్రాజెక్టు పనులు వేగవంతం చేసి నీరు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. మార్కాపురం ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్ గా మార్చేందుకు చొరవ చూపుతామన్నారు. ముఖ్యంగా ఈ జిల్లాలో ఉన్న రెవెన్యూ సమస్యల పై దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో అందుబాటులో ఉంటూ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తామని వివరించారు. అంతకుముందు ఆమె మార్కాపురంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక ప్రజలు నిర్వహించారు. కలెక్టరేట్ వచ్చిన ఆమెకు (తరువాయి 4లో...)



# నూతన కలెక్టర్ విజయ సునీతకు శుభాకాంక్షలు

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మార్చి 28)**

మార్కాపురం జిల్లా తొలి మహిళా కలెక్టర్గా విజయ సునీత శనివారం మధ్యాహ్నం మార్కాపురం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాచారల ప్రకారం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి ఆమెకు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఆమె అధికారిక బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ను షణ్ముఖ వెలుగు దినపత్రిక ఎడిటర్ ఓ రాధాకృష్ణ, మార్కాపురం జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గుమ్మ అంకయ్య యాదవ్లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# సౌర విద్యుత్ పరికరాల బిగింపు ప్రక్రియను వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ పి రాజాబాబు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 28)

సౌర విద్యుత్తు పరికరాల బిగింపు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు స్పష్టం చేశారు. జిల్లాలో పీఎం సూర్య ఘర్ పథకం అమలుపై శనివారం తన క్యాంపు కార్యాలయంలో సంబంధిత అధికారులు, వెండర్లతో ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, ఇతర సామాజిక వర్గాల గృహాల వారీగా వెండర్లకు కేటాయించిన లక్ష్యం, క్షేత్రస్థాయిలో అమలు, మెటీరియల్ సరఫరా, తదితర అంశాలలో పురోగతి పై కలెక్టర్ ఆరా తీశారు. సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నందున అమలులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. సరఫరా చేస్తున్న సామగ్రిలో నాణ్యత లోపాలు ఉంటే వెండర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మరింత మంది ప్రజలు సౌర విద్యుత్ వినియోగం దిశగా ముందుకు వచ్చేలా అవగాహన కల్పించాలని అధికారులను ఆయన ఆదేశించారు. అధికముగా విద్యుత్ వినియోగిస్తున్న గృహాలను గుర్తించి ఆ వివరాలను డీఆర్డీఏ, మెప్మా అధికారులకు అందజేయాలని విద్యుత్ శాఖ అధికారులకు చెప్పారు. ఇలాంటి వినియోగదారులు స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా ఉంటే సౌర విద్యుత్ వినియోగం దిశగా వారిని మళ్లించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఏపీసీపీడీసీఎల్ ఎస్.ఈ. వెంకటేశ్వర్లు, జడ్పి సీఈవో చిరంజీవి, డిఆర్డిఏ పిడి నారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# తప్పుడు పత్రాలతో 'చుక్కల' భూమి గోల్‌మాల్...!

## దళితుల భూమిని ఆక్రమించిన వైసీపీ సర్పంచ్

## బాధితులు ఫిర్యాదు

## స్పందించని రెవెన్యూ యంత్రాంగం



**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, మార్చి 28)**

పేద దళితులకు అండగా ఉండాల్సిన భూములపై అగ్రవర్ణాల కన్ను పడింది. దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూమిని, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్లు చేయించుకున్న వైనం వెలుగులోకి వచ్చింది. అధికారుల నిర్లక్ష్యం, అక్రమార్కుల అండదండలతో వంశపారంపర్యంగా వస్తున్న భూమిని కోల్పోయామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. (తరువాయి 4లో...)









# అద్దంకిలో 54 వాహనాలు సీజ్

సిఐ సుబ్బరాజు








(షణ్ముఖ వెలుగు, అద్దంకి, మార్చి 28)

పట్టణంలో రాజీవ్ నగర్ కాలనీ నందు శనివారం సీఐ సుబ్బరాజు నేతృత్వంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీ నందు ప్రతి వీధిని పోలీసులు జల్లెడ పట్టి 53 ద్విచక్ర వాహనాలు ఒక ఆటోను సీజ్ చేశారు. వీధుల్లో ర్యాలీ చేపట్టి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలంటూ పోలీస్ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ సుబ్బరాజు మాట్లాడుతూ కార్డెన్ సెర్చ్ నందు సరైన ధృవీకరణ పత్రాలు లేని ద్విచక్ర వాహనాలు, ఆటోలను సీజ్ చేసినట్టు చెప్పారు. దొంగతనాలు, గంజాయి, డ్రగ్స్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు సిఐ సుబ్బరాజు తెలియజేశారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు మహమ్మద్ రఫీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ధర్మవరంలో ఇంటింటికి బీసీవై పార్టీ కార్యక్రమం




(షణ్ముఖ వెలుగు, అద్దంకి, మార్చి 28)


మండలంలోని ధర్మవరం గ్రామంలో ఇంటింటికి బీసీవై పార్టీ కార్యక్రమంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొలిటికల్ ఎఫెన్స్ కమిటీ సభ్యురాలు, అద్దంకి నియోజకవర్గ బీసీవై పార్టీ ఇంచార్జ్ మీసాల సామ్రాజ్యం పాల్గొని ఇంటింటికి బీసీ చైతన్యం కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీలు అభివృద్ధి చెందాలంటే రామచంద్ర యాదవ్ స్థాపించిన పార్టీకి మద్దతు పలకాలని అన్నారు. బీసీల అభివృద్ధి రామచంద్ర యాదవ్ తోనే సాధ్యమని ఆమె స్పష్టం చేశారు. బీసీల హామీల అమలు చేయాలని ఆయన అనునిత్యం రాష్ట్ర ప్రభుత్వంతో పోరాటం చేస్తున్నాడని సామ్రాజ్యం వివరించారు. కార్యక్రమంలో యూత్ కన్వీనర్ వెంకటకృష్ణ, ఉష, గాయత్రి, సాయి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు పత్రాలతో 'చుక్కల' భూమి గోల్‌మాల్...!

అసలేం జరిగింది?






జిల్లా కలెక్టరు వారి కార్యాలయం, మార్కాపురం జిల్లా
PGRS లో ఇచ్చిన అర్జీలకు రశీదు
నెం. 1647
తేది : 02/03/2026
1. అర్జీదారుని పేరు : గుంటి సుబ్బయ్య
2. తండ్రి / భర్త పేరు : చిన్న నాగయ్య
3. గ్రామము పేరు : యర్రగొండపాలెం
4. అర్జీదారు ఫోను & ఆధార్ నెంబరు : 9618738442
5. ఫిర్యాదు వివరణ : భూమి ఆక్రమణ గురించి
6. అర్జీ పంపబడిన అధికారి : M.R.O గారు.
సంతకం.

యర్రగొండపాలెంకు చెందిన గుంటి సుబ్బయ్య పేరు మీద యర్రగొండపాలెం ఇలాకా సర్వే నెంబర్ 26 లో నాలుగు ఎకరాల 'చుక్కల భూమి' ఉంది. దీనికి సంబంధించి 1932లోనే ప్రభుత్వం నుంచి మంజూరు పత్రాలు, 10(1) కాపీ, =ఎ కాపీలలో స్పష్టమైన నమోదులు ఉన్నాయి. తరతరాలుగా ఈ భూమిని సుబ్బయ్య వంశస్థులు సాగు చేసుకుంటున్నారు. అయితే, కరువు వల్ల వారు ఉపాధి కోసం వలస వెళ్లిన సమయాన్ని అక్రమార్కులు అవకాశంగా మార్చుకున్నారు.

**ఫోర్జరీ పత్రాలతో రిజిస్ట్రేషన్.....**

తెనాలికి చెందిన నాగం దేవదాసు అనే వ్యక్తి, గుంటి అచ్చయ్య నుంచి భూమిని కొనుగోలు చేసినట్లు నకిలీ పత్రాలు సృష్టించారు. 2015లో అసలు హక్కుదారులకు ఎలాంటి సమాచారం లేకుండానే పుల్లలచెరువు మండలం చాపల మడుగు వైసిపి సర్పంచ్ తమ్మినేని సత్య నారాయణ రెడ్డి తల్లి తమ్మినేని నాసరమ్మ భర్త యోగి వీరారెడ్డికి ఈ భూమిని రిజిస్టర్ చేసేశారు. బాధితులైన గుంటి సుబ్బయ్య కుటుంబ సభ్యులు గుంటి సుబ్బయ్య తండ్రి చిన్న నాగయ్య, గుంటి వెంకటేశ్వర్లు తండ్రి పెద నాగయ్య కుటుంబం తమ భూమిని సాగు చేసుకోవడానికి వెళ్లగా, అగ్రవర్ణాలకు చెందిన కొందరు వ్యక్తులు వారిని భయ భ్రాంతులకు గురిచేసి అడ్డుకుంటున్నారు.

**కదలని రెవెన్యూ యంత్రాంగం – స్పందించిన ఎస్సీ కమిషన్**

బాధితులు పలుమార్లు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో, చివరకు విజయవాడలో ఎస్సీ కమిషన్ చైర్మన్‌ను కలిసి మొరపెట్టుకున్నారు. ఈ అన్యాయంపై సానుకూలంగా స్పందించిన చైర్మన్, వచ్చే నెల 2వ తేదీన స్వయంగా యర్రగొండపాలెం వచ్చి విచారణ చేపడతానని హామీ ఇచ్చారు. మా తాతల కాలం నాటి భూమిని తప్పుడు పత్రాలతో కాజేస్తుంటే అధికారులు పట్టించుకోవడం లేదు. ఎస్సీ కమిషన్ చైర్మన్ పర్యటనతో మాకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నాం.

# జిల్లా అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తాం



జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు ముందుగా స్వాగతం పలికారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు ఆమెకు పుష్ప గుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌తో కలిసి నూతన కలెక్టరేట్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గనుల శాఖ ఏడి రవికుమార్, డిఎంహెచ్ ఓ వాణిశ్రీ, వ్యవసాయశాఖ ఇన్చార్జి జెడి బాలాజీ నాయక్, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ జన్నెమ్మ, సాంఘిక సంక్షేమ శాఖ డిడి లక్ష్మణ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.













# పుల్లల చెరువులో ఈసీసీఈ డే వేడుకలు

చిన్నారుల విద్యపై అవగాహన పెంపు

అంగన్‌వాడీ కార్యకర్త హెప్సీబా



(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, మార్చి 28)

పుల్లలచెరువు గ్రామంలో చిన్నారుల విద్యాభివృద్ధి ప్రధాన లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రం ఎస్సీ2 ఆధ్వర్యంలో ఈసీసీఈ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం గ్రామంలో విద్యాపట్ల అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర పోషించింది. 3 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల చిన్నారులు విద్యా సంవత్సరాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేకంగా ఈ వేడుకలను నిర్వహించారు. చిన్నారుల మానసిక, శారీరక అభివృద్ధికి ప్రాథమిక విద్య ఎంత ముఖ్యమో తెలియజేస్తూ గ్రామస్థుల సమక్షంలో ఉత్సాహభరిత వాతావరణంలో కార్యక్రమాలు కొనసాగాయి. చిన్నారులు పాటలు, ఆటలు, వినోదాత్మక కార్యక్రమాలతో సందడి చేసి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పుల్లల చెరువు ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వేముల కోటేశ్వరరావును ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఆయన చేతుల మీదుగా 5 సంవత్సరాలు పూర్తయిన చిన్నారుల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న చిన్నారుల తల్లిదండ్రులను ప్రత్యేకంగా ఆహ్వానించి, తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి కార్యకర్త హెప్సీబా మాట్లాడుతూ గ్రామంలో విద్యాభివృద్ధి సాధనకు ఇది ముఖ్యమైన అడుగని ఆమె అన్నారు. ఎన్రోల్మెంట్ డ్రైవ్‌ను భాగంగా తీసుకొని, ప్రతి చిన్నారికి ప్రాథమిక విద్య అందేలా చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ సిబ్బంది కృషి చేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు పిల్లల పోషణ, ఆరోగ్య సంరక్షణ, విద్యాపట్ల బాధ్యతలపై అవగాహన కల్పించారు. చిన్నారుల భవిష్యత్తు బాగుండాలంటే ప్రారంభ దశ నుంచే సరైన దిశలో విద్య అందించాల్సిన అవసరం ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.గ్రామంలోని తల్లిదండ్రులు పాల్గొని తమ పిల్లల విద్యపై ఆసక్తి చూపించారు. చిన్నారుల భవిష్యత్తు కోసం ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు.

# సౌర విద్యుత్ పరికరాల బిగింపు ప్రక్రియను వేగవంతం చేయాలి



# విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



(షణ్ముఖ వెలుగు, కంభం, మార్చి 28)

క్లస్టర్ స్థాయి జిఎఫ్ఎల్ఎన్ పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన బోర్డు స్కూల్ విద్యార్థులను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వరికుంట్ల వెంకటేశ్వర్లు అభినందించారు. 4వ తరగతి విద్యార్థిని బి వింధ్య వాసిని, 5వ తరగతి విద్యార్థిని షేక్ అయిషా క్లస్టర్ స్థాయిలో ప్రథమ స్థానం సాధించడం ఉపాధ్యాయుల బోధనా తీరుకు నిదర్శనమన్నారు. క్లస్టర్ స్థాయిలో ఎంపిక చేసిన 5 మంది బెస్ట్ స్టూడెంట్స్‌లో ఇద్దరు విద్యార్థులు బోర్డ్ స్కూల్ నుండి ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు కుర్షీద్ తహ్మీన్, అరుణ్ కుమార్ విద్యా సేవలను ప్రశంసిస్తూ, విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందించారు.

# అమరావతికి చట్టబద్ధత కోసం అసెంబ్లీలో తీర్మానం రాష్ట్ర భవిష్యత్తుకు కీలక మలుపు

## ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

**(షణ్ముఖ వెలుగు, పర్చూరు, మార్చి 28)**

ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా అమరావతిని గుర్తించేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తీర్మానం రాష్ట్ర చరిత్రలో కీలక ఘట్టంగా నిలుస్తుందని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఏర్పడిన అనిశ్చితి పరిస్థితులకు ముగింపు పలుకుతూ, రాజధాని అంశంపై స్పష్టత, స్థిరత్వం తీసుకురావాలనే లక్ష్యంతో ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టినట్లు ఆయన తెలిపారు. అమరావతికి చట్టబద్ధత తీర్మానానికి అసెంబ్లీ ఆమోదం నేపథ్యంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ఒకే రాజధాని అవసరమనే అభిప్రాయంతో విభజన చట్టంలోని సెక్షన్ 5(2)కు తగిన సవరణలు చేయాలని కేంద్రాన్ని కోరుతూ ప్రభుత్వం ముందడుగు వేసిందన్నారు. ఈ తీర్మానం అమలులోకి వస్తే పరిపాలన, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు, మౌలిక వసతుల అభివృద్ధికి అమరావతి కేంద్రంగా మారుతుందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. మహిళా రైతుల త్యాగం చరిత్రలో నిలిచిపోతుంది. అమరావతి కోసం సాగిన రైతు ఉద్యమం స్వాతంత్ర్యానంతరం దేశంలో జరిగిన అతిపెద్ద శాంతియుత ఉద్యమాల్లో ఒకటిగా నిలిచిందని ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. వేలాది మహిళా రైతులు గర్భిణీ స్థితిలోనూ, చిన్నారులతో కలిసి పోరాటంలో పాల్గొనడం విశేషమని తెలిపారు. రైతులు స్వచ్ఛందంగా వేల ఎకరాల



భూములను ప్రభుత్వానికి అప్పగించడం దేశంలోనే అరుదైన ఉదాహరణగా నిలిచిందన్నారు.

**మూడు రాజధానుల నిర్ణయంతో గందరగోళం**

గత ప్రభుత్వం మూడు రాజధానుల ప్రతిపాదనతో రాష్ట్రంలో అయోమయం నెలకొల్పిందని ఎమ్మెల్యే విమర్శించారు. ఉద్యమంలో పాల్గొన్న మహిళలపై పోలీసులు దాడులు జరగడం, పాదయాత్రలను అడ్డుకోవడం వంటి సంఘటనలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. అయినప్పటికీ రైతులు తమ పోరాటాన్ని కొనసాగించి అమరావతి కోసం ఐక్యంగా నిలిచారని తెలిపారు. చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యత కలిగిన ప్రాంతం శాతవాహనుల కాలం నుంచి చారిత్రక ప్రాధాన్యత కలిగిన అమరావతిని రాజధానిగా అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్రానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావచ్చని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. అన్ని ప్రాంతాలకు సమాన అభివృద్ధి కల్పించే కేంద్రంగా అమరావతిని తీర్చిదిద్దాలనే లక్ష్యంతోనే ప్రారంభం నుంచి చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

**భవిష్యత్తుకు పునాది వేస్తున్న తీర్మానం**

అమరావతికి చట్టబద్ధత కల్పించే ఈ తీర్మానం కేవలం పరిపాలనా నిర్ణయం మాత్రమే కాకుండా రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని ఏలూరి సాంబశివరావు తెలిపారు. ప్రజల సంకల్పం, రైతుల త్యాగం, నాయకత్వ నిర్ణయంతో అమరావతి రాష్ట్ర ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

# శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులకు నివాళులర్పించిన జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 28)**

తెలుగు సాహిత్యానికి విశిష్ట సేవలు అందించిన మహానుభావుడు, బహుభాషా కోవిదుడు పద్మశ్రీ పుట్టపర్తి నారాయణాచార్యుల జయంతిని ఈ రోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు పోలీస్ అధికారులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు 1914 మార్చి 28న అనంతపురం మండలంలోని చియ్యేడు గ్రామంలో జన్మించినట్లు, చిన్న వయసులోనే భారతం, భాగవతం, పురాణాలతో పాటు సంగీతం, వ్యాకరణం, ఛందస్సు, భరతనాట్యం వంటి విభిన్న విద్యలను అభ్యసించిన మహానుభావుడన్నారు. సంగీతం, సాహిత్యం, నాట్యం ఆయనలో త్రివేణి సంగమంలా మిళితమై ఉన్నాయని కొనియాడారు. తెలుగు భాషా అభివృద్ధికి చేసిన కృషి అమోఘమని, ఆయన రచనలు సాహిత్యానికి విలువైన సంపదగా నిలిచాయని, ఆధునిక మహాకావ్యంగా పలువురు పండితులు అభివర్ణించే శివతాండవ కావ్యం సృష్టికర్త, తెలుగు సాహితీకారులలో అగ్రగణ్యుడు, బహుబాషా కోవిదుడు పుట్టపర్తి నారాయణాచార్యులు అని కొనియాడుతూ ఆయన 14 సంవత్సరాల వయసులోనే పెనుగొండ లక్ష్మి అనే గేయ కావ్యం రచించారని, ఈ కావ్యం విద్వాన్ పరీక్షకు సైతం ప్రభుత్వం వారిచే పాఠ్య గ్రంథంగా ఎన్నిక కాబడటం విశేషమన్నారు. ఆయన ఆలోచనలను ఆదర్శంగా తీసుకొని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ప్రజాసేవలో మరింత అంకితభావంతో పనిచేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరావు, ఆర్ఐ సీతారామిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## 26 మంది క్విస్ ఫార్మసీ కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు ప్రాంగణ ఎంపికల్లో సత్తాచాటిన విద్యార్థులు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 28)**

ఒంగోలులోని క్విస్ ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 26 మంది విద్యార్థులు సత్తాచాటారు. హైదరాబాద్ కు చెందిన కుహన్స్ కంపెనీ వారు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో వాళ్లంతా ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల యాజమాన్యం తెలియజేసింది. టెక్నికల్, హెచ్ ఆర్ రౌండ్లు నిర్వహించి ప్రతిభ కనబరచిన విద్యార్థులను ఎంపిక చేసుకున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలియజేశారు. ఉద్యోగాలు సాధించిన వాళ్లంతా క్వాలిటీ కంట్రోల్ మరియు క్వాలిటీ ఎస్యూరన్స్ విభాగాల్లో పనిచేయనున్నట్లు చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి దేవి శుభాకాంక్షలు తెలియజేశారు. కళాశాలలో అందిస్తున్న అత్యుత్తమ విద్యకు, ప్లేస్ మెంట్ ట్రైనింగ్ కి నిదర్శనం ఇది అని వారు అన్నారు. కార్యక్రమంలో క్విస్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కిశోర్ బాబు, ట్రైనింగ్ అండ్ ప్లేస్ మెంట్ డీన్ జగదీష్, కో ఆర్డినేటర్ దేవదాసు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు మాట్లాడుతూ ఎంపిక అవ్వడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. కళాశాల వారు అందిస్తున్న ప్రత్యేక శిక్షణ, ఇక్కడ ఉన్న ల్యాబ్ లు, సౌకర్యాల వల్లే ఇది సాధ్యమైందని వారు సంతోషం వ్యక్తం చేశారు.

# అన్నా కాంటీన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

## ఆహార పదార్థాలు పూర్తి నాణ్యతతో ఉండాలి

## జిల్లా కలెక్టర్ పి రాజాబాబు

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మార్చి 28)**

పేద వారు భోజనం చేసే అన్నా క్యాంటిన్ ప్రదేశం, పరిసరాలు పరిశుభ్రంగా ఉండటంతో పాటు ఆహార పదార్థాలు పూర్తి నాణ్యతతో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు నిర్వాహకులను ఆదేశించారు. స్థానిక కొత్తపట్నం బస్టాండ్ వద్ద నున్న అన్నా కేంటీన్‌ను శనివారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ రాజాబాబు ఆకస్మికంగా తనిఖీ చేసి ఆహార నాణ్యత, అన్నా క్యాంటీన్లో అందిస్తున్న భోజనం పట్ల ప్రజల సంతృప్తిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిరుపేద ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన ఆహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం అన్నా కేంటీన్లను ఏర్పాటు చేసిందని, ప్రజల ఆకాంక్షల మేరకు అన్నా కేంటీన్లలో ఆహార పదార్థాలు రుచి, నాణ్యత ఉండేలా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. అన్నా కేంటీన్ లో భోజనం చేస్తున్న ప్రజలను భోజన నాణ్యత, సిబ్బంది ప్రవర్తన, కేంటీన్ పరిసరాలలో పరిశుభ్రత, భోజనం వడ్డించే పాత్రల పరిశుభ్రతను అడిగి తెలుసుకున్నారు. అన్నా క్యాంటీన్లకు వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా భోజనం అందించాలని, అల్పాహారం, భోజనం నిమిత్తం అన్నా కేంటీన్లకు వచ్చే ప్రజలకు మెరుగైన సేవలందించడంతోపాటు, వారి పట్ల గౌరవంగా ప్రవర్తించాలని కేంటీన్ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమీషనర్ వెంకటేశ్వరరావుతో కలసి అన్నా క్యాంటీన్లో భోజనం చేశారు. కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.











# ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి హాని



**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మార్చి 28)**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రతి ఒక్కరు బాధ్యతగా ముందుకు రావాలని ఎంపీడీవో డాక్టర్ పి సుజాత కోరారు. మండలంలోని ముప్పాళ్ళ గ్రామంలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛంద కార్యక్రమం నిర్వహించారు. సుజాత మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి తీవ్రమైన ఆయన్ని కలిగిస్తుందని దీన్ని తగ్గించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. పర్యావరణానికి హాని కలిగించని ప్రత్యామాయ వస్తువులను వినియోగించాలన్నారు. గ్రామంలో శుభ్రత పరిశుభ్రత ను కాపాడటం ద్వారా ఆరోగ్యకరమైన జీవన విధానం సాధ్యమవుతుందని ఆమె సూచించారు. అనంతరం సిబ్బంది గ్రామ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బి సతీష్ బాబు, పీడీఓ సుబ్బారావు, స్వర్ణ గ్రామ సిబ్బంది అంగన్వాడి సిబ్బంది ప్రజల పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు





**(షణ్ముఖ వెలుగు, వేటపాలెం, మార్చి 28)**

వేటపాలెంలో శనివారం స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, ఎండిఓ రాజేష్ బాబు, తెలుగు యువత అధ్యక్షులు బాలకృష్ణలు ర్యాలీలో పాల్గొన్నారు. పరిసరాలు పరిశుభ్రత మన అందరి బాధ్యత అంటూ ప్రజలకు అవగాహన కల్పించారు. పలు బేకరీలు, దుకాణదారులకు ఆర్డిఓ చంద్రశేఖర్ నాయుడు పరిశుభ్రత గురించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని ప్రజలు పూర్తిగా తగ్గించాలని అన్నారు. ప్లాస్టిక్ వలన మంచినీరు, పరిసరాలు కలుషితమవుతున్నాయని దీనితోపాటు గాలి కూడా విషపూరితంగా మారే అవకాశం ఉందని ఆయన చెప్పారు. ఎండిఓ మాట్లాడుతూ స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని అన్నారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని ఆయన స్పష్టం చేశారు. తెలుగు యువత అధ్యక్షులు బాలకృష్ణ మాట్లాడుతూ స్వచ్ఛ గ్రామమే లక్ష్యంగా ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో గీత రాణి, సెక్రటరీ సురేంద్ర, మండల టిడిపి అధ్యక్షులు కొత్త నాగు, అధికార సిబ్బంది పాల్గొన్నారు.

# చలివేంద్రం ప్రారంభం




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 28)**

శ్రీ విశ్వ వికాస భారతి సేవా సంస్థ, ప్రకాశం జిల్లా పురోహిత పరిషత్ వారి సౌజన్యంతో ఒంగోలు మంగమ్మ కాలేజి వద్ద ఇండియన్ పెట్రోల్ బంకు వద్ద చలివేంద్రాన్ని శనివారం క్రైమ్ బ్రాంచ్ ఏసిపి కమ్మరిపల్లె మల్లికార్జున కిరణ్ కుమార్, పిడిసిసి బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్యలు కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీ విశ్వ వికాస భారతి సేవా సంస్థ వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ పోతులూరి శివబ్రహ్మాచార్యులు, పరిషత్ గౌరవ సలహాదారులు బ్రహ్మశ్రీ ఫణిదపు బ్రహ్మయ్యాచార్యులు, శ్రీ విశ్వ వికాస భారతి సేవా సంస్థ గౌరవాధ్యక్షులు దేపూరి వెంకట్రావు, గౌరవ సలహాదారులు నిమ్మల అనిల్ కుమార్, అధ్యక్షులు అద్దేపల్లి శివరామరాజు, కోశాధికారి జంపని శివానంద్ కుమార్, పరిషత్ ప్రధాన కార్యదర్శి కడియంపాటి గౌరీశంకర్, నూతలపాటి శివప్రసాదరావు, ఇండియన్ పెట్రోల్ బంకు గీత, ఫీల్డింగ్ స్టేషన్ అధినేత సుబ్బారావు, పాలెపు వెంకటేశ్వరశర్మ, రిటైర్డ్ తహశీల్దార్ శోభిరాల సుబ్బారావు, ఆచారపు రాఘవాచార్యులు, సుబ్బరత్నాచారి, తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలి

## జిల్లా సంయుక్త కలెక్టర్ భావన వశిష్ట








**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, మార్చి 28)**
పరిసరాల పరిశుభ్రత లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ భావన వశిష్ట తెలిపారు. శనివారం జిల్లా స్థాయి స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం చెరుకుపల్లిలో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా సంయుక్త కలెక్టర్ భావన వశిష్ట ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుండి అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో జిల్లా అధికారులు, విద్యార్థులు, అంగన్వాడీ కార్యకర్తలు, స్వయం సహాయక సంఘ సభ్యులు, డ్వాక్రా గ్రూపు సభ్యులు పాల్గొన్నారు. అంబేద్కర్ కూడలి వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించి, ర్యాలీలో పాల్గొన్న సభ్యులచే మానవహారం ఏర్పాటు చేసి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ర్యాలీ అంబేద్కర్ కూడలి నుండి ఎంపీడీవో కార్యాలయం వరకు కొనసాగించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ భావన వశిష్ట మాట్లాడుతూ, స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ను రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మూడో శనివారం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతినెల ఒక అంశం ఆధారంగా నిర్వహిస్తున్నారని ఈనెల " జీరో వేస్ట్ ఇన్స్టిట్యూషన్స్ " ( వ్యర్థ రహిత సంస్థలు ) అంశంపై కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని ప్రతి గ్రామపంచాయతీ, ప్రభుత్వ కార్యాలయం, పాఠశాల, అంగన్వాడీ కేంద్రం తదితర సంస్థల్లో నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. జిల్లాలోని ప్రతి సంస్థను వ్యర్థ రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. వ్యర్థాల వర్గీకరణలో 100% అమలుతోనే పరిష్కారం లభిస్తుందని అన్నారు. ప్రతి గృహం, ప్రతి సంస్థ స్థాయిలోనే తడి, పొడి, ప్రమాదకర వ్యర్థాలను తప్పనిసరిగా వేరు చేయాలన్నారు.తడి వ్యర్థాలను కంపోస్ట్ పిట్లలో లేదా చెత్త నుండి సంపద కేంద్రాల ద్వారా ప్రాసెస్ చేసి సేంద్రీయ ఎరువుగా మార్చాలన్నారు.పొడి వ్యర్థాలను శాస్త్రీయంగా సేకరించి రీసైక్లింగ్‌కు పంపించి ఆదాయ వనరుగా మలచాలని అన్నారు.ప్రమాదకర వ్యర్థాలను విడిగా సేకరించి సంబంధిత సంస్థలకు అప్పగించాలన్నారు.గ్రీన్ (తడి), బ్లూ (పొడి), రెడ్ (ప్రమాదకర) డస్ట్‌బిన్‌లను ప్రతి కార్యాలయం, పాఠశాల, అంగన్వాడీలో ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి మహిళ ఇంటిలోని తడి చెత్త నుండి బయోగ్యాస్ ఉత్పత్తికి శ్రీకారం చుట్టాలని జిల్లా సంయుక్త కలెక్టర్ భావనా వశిష్ట అన్నారు. బయోగ్యాస్ ను ఇంట్లోని వంటలకు వాడుకోవచ్చు అన్నారు. తద్వారా గ్యాస్ సంక్షోభం నుండి బయటపడవచ్చని అన్నారు. చెత్తను సక్రమంగా వేరు చేసి అందిస్తూ పరిసరాల పరిశుభ్రంగా ఉంచాలని ఈ విషయంలో తల్లిదండ్రులు పిల్లలకు అవగాహన కల్పించాలని అన్నారు. పొడి చెత్త సేకరణ కొరకు రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ రథాలను ఏర్పాటు చేసిందని జిల్లా సంయుక్త కలెక్టర్ భావన వశిష్ట తెలిపారు. ఈ రథాలు ప్రతి జిల్లాలోనూ, మండలాల్లోనూ, గ్రామాలలోనూ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ రథంలో పొడి చెత్త అయినటువంటి ప్లాస్టిక్, ఇనుము, పనికిరాని పుస్తకాలు మొదలగు వాటిని విక్రయిస్తారని, వాటికి సంబంధించి ప్రత్యేక ధరలను కేటాయించడమైనదని, ఆ పొడి చెత్తను స్వచ్ఛ రథాలకు అందజేసి ఇంట్లోకి కావాల్సిన సరుకులను పొందవచ్చని ఆమె అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సౌకర్యాన్ని వినియోగించుకొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఇప్పుడు చెత్త నుండి విద్యుత్ ఉత్పత్తిని చేయుటకు రాష్ట్ర ప్రభుత్వం కర్మాగాళాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా సంయుక్త కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా రేపల్లె రెవెన్యూ డివిజన్ అధికారి పి శ్రీదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని, గోనితో తయారుచేసిన సంచులు మాత్రమే వాడాలని, ప్లాస్టిక్ వాడకం నిషేధించడం వలన 50 శాతం పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని ఆమె అన్నారు. ప్రతి ఇంట్లో చెత్తను విడివిడిగా వేరు చేసి అందజేయాలని, ఈ పనిని పిల్లల దగ్గర నుండి ప్రతి ఒక్కరూ చేపట్టాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, అంగన్వాడీ కార్యకర్తలు, స్వయం సహాయక సంఘ సభ్యులు, డ్వాక్రా సంఘ సభ్యులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన రామాలయంకి శంకుస్థాపన





**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, మార్చి 28)**
చిన్నగంజాం మండలం రాజు బంగారుపాలెం అమ్మిన్ నగర్ గ్రామంలో నూతనంగా నిర్మించనున్న హనుమన్ లక్ష్మణ సమేత సీతరామచంద్ర స్వామి దేవలయం నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం రామాలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పూర్తి రాతి కట్టడంతో ఆగమశాస్త్రం ప్రకారం ఆలయ నిర్మాచనున్న అలయనికి అర్చకులు ప్రత్యేక పూజలు,హోమం నిర్వహించారు. ప్రతి ఇంటి నుండి మహిళలచే కొబ్బరికాయ, పసుపు కుంకుమ, మంగళహారతులతో తీసుకొచ్చి నీళ్లబిందెలతో జలాభిషేకం చేసి ఘనంగా నూతన రామాలయం నిర్మాణ శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

## యూనివర్సిటీ ఖోఖో టీంకు 'రైజ్' విద్యార్థి ఎంపిక




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 28)**
స్థానిక రైజ్ కృష్ణ సాయి ప్రకాశం గ్రూపు విద్యార్థిని యూనివర్సిటీ ఖోఖో టీం లో ఆడేందుకు ఎంపికైనట్లు కళాశాల సెక్రటరీ శిద్దా హనుమంతరావు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ ఏవి భాస్కరరావు మాట్లాడుతూ జేఎన్టీయూకే యూనివర్సిటీ తరఫున ఖోఖో టోర్నమెంట్లో ఆడేందుకు రైజ్ కళాశాల విద్యార్థిని ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో జేఎన్టీయూకే నిర్వహించిన యూనివర్సిటీ టీం సెలక్షన్స్ లో భాగంగా మహిళ ఖోఖో విభాగంలో రైజ్ కృష్ణ సాయి ప్రకాశం గ్రూపుకు చెందిన విద్యార్థి బండి మంజు ఎంపిక అయిందని, కర్ణాటకలోని దావంగిరి యూనివర్సిటీ లో ఏప్రిల్ 2 నుండి 6వ తేదీలలో జరిగే సౌత్ జోన్ మహిళా ఖోఖో పోటీలలో జేఎన్టీయూకే కాకినాడ టీం తరఫున ఆడుతుందని రాగా చీఫ్ అడ్వైజర్ శిద్దా ప్రవల్లిక ఈ సందర్భంగా తెలియజేశారు. విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థిని కళాశాల గౌరవ చైర్మన్ మిస్ కాలా చిన్న రంగమన్నార్, గాంధీ కళాశాల ప్రిన్సిపాల్ కెవి సుబ్రహ్మణ్యం, ఫిజికల్ డైరెక్టర్ ఎస్ హిమచంద్రాబాబు, ఎం వెంకటేశ్వర్లు అభినందించారు.

## నూతన వధువరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే కదిరి



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, మార్చి 28)**
ఏరువారిపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యులు వీరంరెడ్డి బ్రాహ్మరెడ్డి కుమార్తె మౌనిక రెడ్డి వివాహ వేడుక ఇటీవల జరిగింది. శనివారం కనిగిరి మాజీ ఎమ్మెల్యే విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు కనిగిరిలోని బ్రాహ్మరెడ్డి నివాసగృహానికి వెళ్లి నూతనవధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ షేక్ జిలాని, మాజీ కౌన్సిలర్స్ షేక్ ఫయాజ్, తమ్మినేని సుజాత, సర్పంచ్ షేక్ బుజ్జి, గోను చంద్రశేఖర్‌రెడ్డి, యం శ్రీహరిరెడ్డి, బొట్టు శ్రీను, మార్తల రామురెడ్డి, ముత్యాల ప్రతాప్, షేక్ షరీఫ్, షేక్ ఖాదర్, ఖాసీం సాహెబ్, కరీముల్లా, అంజుమన్ కమిటి మాజీ అధ్యక్షులు అబ్దుల్ లతీఫ్, మాజీ టౌన్ అధ్యక్షులు నాగూర్ వలి, వెంకట్రావు, రమణారెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, శ్రీనాథ్, అంజి, తదితరులు పాల్గొన్నారు.

# క్రికెట్ బెట్టింగ్ జోలికి వెళ్లొద్దు జీవితాలు నాశనం చేసుకోకండి

### ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు

### క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడినా, నిర్వహించినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవు

### క్రికెట్ బెట్టింగ్ లపై జిల్లా పోలీసులు ప్రత్యేక నిఘా

### జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 28)**
అమాయక ప్రజలను, యువతను లక్ష్యంగా చేసుకుని ఎక్కువగా డబ్బు సంపాదించవచ్చని ప్రలోభపెడుతూ క్రికెట్ బెట్టింగ్ నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. నేటి నుంచి ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభమవుతున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ నిఘా ఉంచినట్లు తెలిపారు. యువత, విద్యార్థులు బెట్టింగ్ జోలికి వెళ్లకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. క్రికెట్ బెట్టింగ్ చట్టవిరుద్ధమని, ఇది ఆర్థికంగా, సామాజికంగా జీవితాలను నాశనం చేస్తుందని, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని, అవి మోసపూరితంగా ఉండే అవకాశం ఉందని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. క్రికెట్ బెట్టింగ్ వల్ల కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని పేర్కొన్నారు. వినోదం కోసం మాత్రమే క్రికెట్ మ్యాచ్‌లు చూడాలని, బెట్టింగ్ వైపు మొగ్గు చూపకూడదని సూచించారు. బెట్టింగ్ యాప్‌లలో బాల్-టు-బాల్ పందేలు వేసే అవకాశం ఉండటంతో, ఆకర్షణీయమైన ప్రకటనలను నమ్మి అత్యాశకు పోకుండా యువత జాగ్రత్తగా ఉండాలని, శ్రమించకుండా వచ్చే డబ్బు వెనుక అనేక నష్టాలు దాగి ఉంటాయని గుర్తుంచుకోవాలని సూచించారు. పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక నిఘా ఉంచాలని, యువత చదువుపై దృష్టి పెట్టాలని, తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చేలా ఉన్నతంగా జీవించాలని సూచించారు. బెట్టింగ్ కేసుల్లో ఇరుక్కొని జీవితాలను నాశనం చేసుకోకూడదని హెచ్చరించారు. అమాయకులను ఆసరాగా చేసుకుని ఎవరైనా డబ్బు ఆశ చూపించి క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడినా, నిర్వహించినా, ప్రోత్సహించినా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. బెట్టింగ్ వెబ్‌సైట్లు, యాప్‌లపై నిఘా ఏర్పాటు చేసి, ఏపీ జూద చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా క్రికెట్ బెట్టింగ్ జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే స్థానిక పోలీసులకు, డయల్ 112 కు లేదా పోలీస్ వాట్సాప్ నెంబర్ 9121102266కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

## బస్సు ప్రమాద బాధితులను పరామర్శించిన కలెక్టర్





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 28)**
మార్కాపురం లోని జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాయవరం బస్సు ప్రమాద బాధితులను జిల్లా నూతన కలెక్టర్ ఎం. విజయ సునీత శనివారం రాత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా వైద్యం అందుతున్న తీరును వారిని అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండి పూర్తిగా కోలుకున్న తర్వాతనే ఇక్కడ నుంచి వెళ్లాలని వారికి భరోసానిచ్చారు. చిన్న చిన్న గాయాలతో కోలుకొని ఇంటికి వెళ్లిన వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఏదైనా అవసరమైతే వారికి సైతం వైద్య పరంగా సహాయం అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, డిఎంహెచ్వో వాణిశ్రీ, జిల్లా మలేరియా అధికారి రాహుల్, ఇతర ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.

# కాలిపోయిన వారంతా దళితులే పరిహారంలో కూటమి ప్రభుత్వం కులవివక్షత



## బస్సు ప్రమాదంలో మరణించిన వారికి రూ.20 లక్షలు ఎక్స్ గ్రేషియా ప్రకటించాలి ప్రమాద బస్సు యజమానులను ఉపా క్రింద అరెస్టు చేయాలి దళిత నేత నీలం డిమాండ్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 28)

రాయవరం బస్సు ప్రమాదంలో కాలిపోయిన ప్రయాణికుల కుటుంబాలకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని పరిహారంలో కూడా కూటమి ప్రభుత్వం కుల వివక్షత చూపిస్తుందని, ప్రమాద కారకులైన బస్సు యజమానుల పై ఉపా నేరం పైన అరెస్టు చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేసారు. శనివారం ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న రాయవరం బస్సు ప్రమాద బాధితులను పరామర్శించారు. దాసరి మౌనిక అనే విద్యార్థిని మాట్లాడుతూ తమ బంధువులు ఐదుగురు చని పోయారని చెప్పారు. అలాగే విజయవాడలో బీటెక్ చదువుతున్నాను. నా లాప్‌టాప్ బస్సు ప్రమాదంలో కాలిపోయిందన్నారు. వింజమూరుకు చెందిన సావుటూరి ఆమోస్ యానాది కులానికి చెందిన 16 సంవత్సరాల యువకుడు బస్సు ఎగ్జిట్ డోర్ పగలగొట్టి చాలామంది ప్రయాణికులను రక్షించాడన్నారు. కామారెడ్డిలో బయలుదేరిన హరికృష్ణ ప్రైవేటు ట్రావెల్స్ బస్ ఇందలవాయి దగ్గర ఆపి ప్రయాణికులను మరొక బస్సు ఎక్కించారన్నారు. బస్సులోని ప్రయాణికులు ఎక్కువ భాగం బేల్దారు పనుల నిమిత్తం తెలంగాణ వెళ్లి శ్రీరామనవమి పండగ సందర్భంగా స్వగ్రామాలకు వస్తున్న వారే అన్నారు. ఈ బస్సు రిపేర్ వచ్చి త్రిపురాంతకం దగ్గర ఆగిపోయింది అన్నారు. బస్సు ఓనర్ అయిన హరికృష్ణరెడ్డి త్రిపురాంతకం నుండి బస్సును నడుపుతూ రాయవరం దగ్గర టిప్పర్‌ను గుద్ది 14 మంది ప్రాణాలు తీసిన యముడిగా మిగిలారన్నారు. బస్సు ప్రమాదం జరిగిన వెంటనే బస్సు యజమాని అయిన డ్రైవర్ హరికృష్ణరెడ్డి ఎగ్జిట్ డోర్ కూడా ఓపెన్ చేయకుండా ప్రయాణికులను అప్రమత్తం చేయకుండా బస్సు దూకి పారిపోయారన్నారు. 5.30 గంటలకు బస్సు ప్రమాదం జరిగినప్పుడు మొదటిగా అంబులెన్స్ వచ్చిన తర్వాతనే చాలా సేపటికి పోలీసులు ఫైర్ ఇంజన్లు వచ్చారన్నారు. రాయవరం బస్సు ప్రమాదంలో కాలిపోయిన వారిలో ఎక్కువమంది దళితులు ఉండబట్టి కూటమి ప్రభుత్వం పరిహారంలో కుల వివక్షత చూపించిందన్నారు. ఇటీవల కర్నూల్‌లో జరిగిన బస్సు ప్రమాద ఘటనలో మృతుల కుటుంబాలకు ఇదే కూటమి ప్రభుత్వం పది లక్షలు పరిహారాన్ని ఇచ్చిందన్నారు. గోదావరి జిల్లాలలో బాణాసంచ పేలి మరణించిన వారి కుటుంబాలకు, ఫార్మా కంపెనీలో ప్రమాదం వలన చనిపోయిన వారికి కూడా 20 లక్షల రూపాయలు పరిహారం ప్రకటించిందన్నారు. ప్రకాశం జిల్లాలోని వైసీపీ ప్రభుత్వంలో 2020 మే 7వ తేదీ న నాగులప్పలపాడు మండలం మాచవరం గ్రామంలో ట్రాక్టర్ ప్రమాదంలో మరణించిన పదిమందికి, అలాగే తిమ్మసముద్రంలో బట్టలు ఉతకటానికి వెళ్లి కాలు జారి మరణించిన ముగ్గురు మహిళలకు కూడా ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున కోటి 30 లక్షల రూపాయలు తమ డిమాండ్‌తో వైసిపి ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఒంగోలు లాంటి పట్టణాలలో కూడా స్కూటీలపై వెళ్లే ఆడపిల్లలని సైతం డ్రైవింగ్ లైసెన్స్,హెల్మెట్,పొల్యూషన్ సర్టిఫికెట్ అంటూ పోలీసులు తనిఖీలు చేసి ఫైన్లు వేస్తూ విద్యార్థులు మహిళలను కూడా ప్రమాదాల బారి నుండి రక్షిస్తున్నరు. కానీ ఇతర రాష్ట్రాలలో ప్రైవేటు బస్సులను కొని ప్రభుత్వ పన్నులు చెల్లించకుండా స్లీపర్ కోచ్లుగా మార్చి రాష్ట్రంలో తిప్పుతున్న రవాణా శాఖ అధికారులు లంచాలు మింగుతూ తనిఖీలు చేయకుండా ప్రైవేటు బస్సు యజమానుల ధన దాహానికి గొడుగు పడుతూ ప్రయాణికుల ప్రాణాలు తీస్తుందన్నారు. ప్రమాదాల్లో చనిపోయిన వారి ప్రాంతాలను బట్టి చనిపోయిన వారి కులాలను బట్టి ప్రభుత్వం ప్రకటించటం కూటమి ప్రభుత్వ కుల వివక్ష అని నీలం అన్నారు. రాయవరం బస్సు ప్రమాదంలో కాలిపోయిన కుటుంబాలకు 20 లక్షల ప్రకటించాలని కూటమి ప్రభుత్వాన్ని దళిత నేత నీలం డిమాండ్ చేశారు. అలాగే పర్మిట్ లేని, ఫిట్నెస్ లేని బస్సులను నడుపుతున్న హరికృష్ణ ప్రైవేట్ ట్రావెల్స్ లాంటి బస్సు యజమానులను ఉగ్రవాద నిరోధక కార్యకలాపాల చట్టం ఉపా క్రింద అరెస్టు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని నీలం డిమాండ్ చేశారు. బాధితులను పరామర్శించిన వారిలో దారా అంజయ్య, పత్రా బంగారం, కాకుమాను రవి, మేడికొండ మురళి, దేవరపల్లి రమణ, ఏలూరు శ్రీను, తదితరులు ఉన్నారు.

# ప్రజల ఆరోగ్యం వ్యక్తిగత, గ్రామం పరిశుభ్రతపైనే ఆధారపడి ఉంది

## జాయింట్ కలెక్టర్ కల్పన కుమారి









(షణ్ముఖ వెలుగు, జె పంగులూరు, మార్చి 28)

జెపంగులూరు గ్రామపంచాయతీలో శనివారం జాయింట్ కలెక్టర్ కల్పన కుమారి స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పరిశుభ్రతకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ ప్రతి నెలా మూడవ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్యం వ్యక్తిగత, గ్రామం పరిశుభ్రత పైనే ఆధారపడి ఉందని తెలియజేశారు. స్వచ్ఛ రథం ప్రారంభించి ప్రజలు పొడి చెత్తను ఈ వాహనానికి ఇచ్చినిత్య అవసర సరుకులు తీసుకో వచ్చని తెలిపి గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని తెలియజేశారు. గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వ సంస్థల పరిశుభ్రత, ప్రజారోగ్యం, ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని జాయింట్ కలెక్టర్ తెలిపారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి బి చిరంజీవి మాట్లాడుతూ ఇండ్లలో నుంచి వచ్చే చెత్తను శాస్త్రీయంగా వేరు చేసి పంచాయతీ సిబ్బందికి అందించి వ్యక్తిగతంగా, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలనీ సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి ఎం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పరిశుభ్రత విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్నటువంటి నిర్ణయాలకు అనుగుణంగా ప్రజలందరూ పారిశుద్ధ్యం విషయంలో పంచాయతీ సిబ్బందికి సహకరించాలని తెలియజేశారు. స్వచ్ఛ రథం వాహనానికి ప్రజలు ప్లాస్టిక్ అందించి తమకు కావాల్సిన వస్తువులు తీసుకు వెళ్ళాలి అని తెలియ జేశారు. ఈ సందర్భంగా మండల పరిషత్ ఉన్నత పాఠశాల నందు జీరో వేస్ట్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలకు జీరో వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు డోర్ టు డోర్ గార్బేజి కలెక్షన్, తడి చెత్త, పొడి చెత్త ఏర్పాటు, వ్యక్తిగత, సామూహిక పరిశుభ్రత ప్రాముఖ్యత, వ్యర్థాల వర్గీకరణ, స్వచ్ఛత నిర్వహణపై సూచనలు తెలియజేశారు. పరిశుభ్రత విషయంలో అందరూ జాగ్రత్త వహిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా హరిత రాయబారులకు వారు చేస్తున్న సేవలకు వారిని గుర్తించి సన్మానించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ జాన్సన్, మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు, విద్యార్థులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వివిధ వాహనాలకు ఎల్ఈడీ దీపాలు తొలగింపు







(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మార్చి 28)

ఉలవపాడు ఎస్ఐ జి సుబ్బారావు ఆధ్వర్యంలో వాహన తనిఖీల్లో భాగంగా శనివారం సాయంత్రం జాతీయ రహదారి పక్కనే సౌత్ బైపాస్ జంక్షన్‌లో వివిధ వాహనాలకు ఎల్ఈడీ దీపాలు తొలగించడం జరిగింది. ఎల్ఈడి దీపాల వల్ల ఎక్కువ కాంతి ఎదుటి వాహన డ్రైవర్లమీద పడడం వల్ల వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని జిల్లా పోలీసు అధికారుల ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

## సంపన్నకారి కార్యక్రమం పై శిక్షణ



(షణ్ముఖ వెలుగు, ఇంకొల్లు, మార్చి 28)

జీవనోపాధి నుంచి సంపద సృష్టి స్థాయికి మహిళా వ్యాపారాలను తీసుకెళ్లడం, వ్యాపార వృద్ధి చేయడం, ఉద్యోగాలు సృష్టించడమే సంపన్నకారి కార్యక్రమం ఉద్దేశ్యం అని జిల్లా డిస్టిక్ ప్రాజెక్టు మేనేజర్ ప్రమీల అన్నారు. శనివారం ఇంకొల్లు మండలం వెలుగు కార్యాలయము నందు ఎపిఎమ్ అనురాధ అధ్యక్షతన గ్రామ సంఘ సహాయకులకు మరియు గ్రూప్ సభ్యులకు సంపన్నకారి కార్యక్రమం మీద ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిస్టిక్ ప్రాజెక్టు మేనేజర్ ప్రమీల పాల్గొని సభ్యులకు శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ప్రమీల మాట్లాడుతూ సంపన్నకారి అంటే చాలా వ్యాపారాలు ఒక స్థాయి తర్వాత మరింతగా అభివృద్ధి చెందటానికి సరైన వ్యాపార ప్రణాళిక, మార్కెట్ అవకాశాలు, పెట్టుబడి సమస్యల పరిష్కరించడానికి రూపొందించబడిందన్నారు. కార్యక్రమం అనంతరం సంపన్నకారి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏపిఎం అనురాధ, సీసీలు, అకౌంటెంట్ పాల్గొన్నారు.

## ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి, ప్రజల సంక్షేమానికి కృషి చేయాలి

### ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 28)

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యకర్తలు, అభిమానులు, జిల్లా ప్రజలందరికీ ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం అనేది తెలుగు జాతి గర్వానికి, స్వాభిమానానికి ప్రతీక. 1982 మార్చి 29న నందమూరి తారక రామారావు స్థాపించిన ఈ పార్టీ, తెలుగు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి బీజం వేసిన గొప్ప సంస్థ" అని అన్నారు. ఈ రోజు మనం 44 సంవత్సరాల సుదీర్ఘ ప్రస్థానాన్ని గుర్తు చేసుకుంటున్నామని, నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ దీర్ఘ దృష్టితో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తోందన్నారు. ఈ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి, ప్రజల సంక్షేమానికి కృషి చేయాలని కోరుతున్నానన్నారు.

# కనిగిరిలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం విజయవంతం





(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, మార్చి 28)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి నెల మూడవ శనివారం నిర్వహిస్తున్న "స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా శనివారం కనిగిరి పురపాలక సంఘం పరిధిలో విస్తృతంగా శుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి సూచనల మేరకు మునిసిపల్ కమిషనర్ పి. శ్రీధర్ ఆధ్వర్యంలో కనిగిరి మునిసిపల్ కార్యాలయంలో "జీరో వేస్ట్ ఇన్‌స్టిట్యూషన్స్" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ కార్యాలయం పరిసరాలను శుభ్రపరిచి చెత్తను పూర్తిగా తొలగించారు. అనంతరం మునిసిపల్ కార్యాలయం నుండి పొదిలి రోడ్డులోని బైపాస్ వరకు ర్యాలీ నిర్వహించారు. శ్రమదానం ద్వారా రహదారి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు, మట్టి కుప్పలు, చెత్తను జేసీబీ యంత్రాల సహాయంతో తొలగించారు. అనంతరం "స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర" ప్రతిజ్ఞ చేయించి పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కనిగిరి డివిజన్ రెవెన్యూ అధికారి, మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ ఎం వెంకట శివరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ పి శ్రీధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ నాయబ్ రసూల్, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ మంద్రు రమేష్ బాబు, మెప్మా సిబ్బంది, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నాయకులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

# స్వర్ణ ఆంధ్రాలో ప్రజలు భాగస్వాములు కావాలి!



(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, మార్చి 28)

మండలంలోని మేదరమెట్ల గ్రామంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద శనివారం స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం లో భాగంగా ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎండిఓ రాజ్యలక్ష్మి పాల్గొని మాట్లాడారు. స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రజలు తమ ఇంటితోపాటు పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్వచ్ఛ గ్రామమే లక్ష్యంగా అధికారులంతా పనిచేస్తున్నారని ఎండిఓ రాజలక్ష్మి పేర్కొన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే గాలి, నీరు కాలుష్యం కాకుండా ఉంటుందని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ లక్ష్మీకాంత్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ కాలేషా, డ్వాక్రా, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

# ఒంగోలు నగరాన్ని క్లీన్ సిటీగా మార్చడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

## జిల్లా కలెక్టర్ పి రాజాబాబు











(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మార్చి 28)

ఒంగోలు నగరాన్ని క్లీన్ సిటిగా మార్చడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు పిలుపు నిచ్చారు. శనివారం ఒంగోలు నగరంలోని డిఆర్ఆర్ఎం హైస్కూల్‌లో జరిగిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి రాజాబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఒంగోలు నగరాన్ని క్లీన్ సిటిగా మార్చడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రతి ఒక్కరూ శుభ్రత పాటిస్తూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లయితే ఆరోగ్యంతో పాటు ఆత్మ గౌరవంతో జీవనం సాగించవచ్చన్నారు. ప్రభుత్వం ప్రతి నెలా మూడవ శనివారం స్వచ్ఛత మీద ఒక కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. ప్రజల్లో శుభ్రత గురించి అవగాహన కల్పించడంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఒక వ్యక్తి పరిశుభ్రంగా ఉంటే వారి కుటుంబం పరిశుభ్రంగా ఉంటుందని, తద్వారా సమాజమంతా పరిశుభ్రంగా, ఆరోగ్యంగా ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుండే పరిసరాల పరిశుభ్రత పై అవగాహన పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేయడం వలన దోమలు, ఈగలు పెరిగి వ్యాధులు కలిగిస్తాయని, తడి, పొడి చెత్తలను వేరు చేసి డస్ట్‌బిన్స్‌లో వేయాలని తెలిపారు. వీధులు పరిశుభ్రంగా ఉండేలా చూడడం ప్రతి ఒక్కరి బాధ్యతని, ఈ విషయంలో సామూహికంగా కృషి చేయాలన్నారు. తడి, పొడి, పారిశుద్ధ్య వ్యర్థాలను వేరు చేయడమే స్వచ్ఛతకు తొలి అడగని, వ్యర్థాల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం పెంపు పై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా స్వర్ణ ఆంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. వేసవి కాలం నేపథ్యంలో పక్షులకు తాగునీరు అందించేలా ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఉట్టేలను జిల్లా కలెక్టర్ ప్రారంభించి వాటిలో నీటిని పోయడం జరిగింది. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలను నాటడం జరిగింది. స్వచ్ఛత పై 9వ తరగతి విదార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు, జిల్లా కలెక్టర్ బహుమతులు ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు మున్సిపల్ కమీషనర్ కోడూరి వెంకటేశ్వరరావు, ఐటిసి డబ్ల్యూఓడబ్ల్యూ సంస్థ ప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది, ప్రజలు, పాఠశాల విద్యార్థులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఒక్క ఇంజెక్షన్ అతన్ని శాశ్వత వికలాంగుడయ్యే ప్రమాదం నుంచి కాపాడింది

### గోల్డెన్ అవర్‌లో ఇవ్వాల్సిన వైద్యం ఇవ్వడం ద్వారా ఆ యువకుడిని పెద్ద అపాయం నుంచి కాపాడగలిగారు

### ఒక్క ఇంజక్షన్‌తో పక్షవాతానికి చెక్ పెట్టారు జిజిహెచ్ వైద్యులు

### అభినందించిన జిజిహెచ్ సూపరెంటెండెంట్ డాక్టర్ ఎస్ మాణిక్యరావు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 28)

ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం బదుగురుపాడుకు చెందిన 32 ఏళ్ల యేసు 28వ తేదీ తెల్లవారుజామున 3 గంటల సమయం పక్షవాతానికి గురయ్యారు. కాళ్ళు, చేతులు కదలలేని స్థితిలో ఉదయం జిజిహెచ్ క్యాజువాలిటీ నందు అత్యవసర విభాగంలో చేరారు. దీంతో అక్కడ క్యాజువాలిటీ వైద్యులు పక్షవాతం సోకినట్టు గుర్తించి వెంటనే ఈ సమాచారాన్ని న్యూరాలజి డిపార్ట్మెంట్ వైద్యులు డాక్టర్ నటరాజ్, డాక్టర్ హరి లకు తెలియజేసారు. యేసు ఆసుపత్రిలో చేరిన నిమిషాల వ్యవధిలో స్కాన్ చేసి వ్యాధి తీవ్రతను పరీక్షించారు. 32 ఏళ్ల యేసుకు చికిత్స అందిస్తే నయం అవుతుంది అని భావించి డాక్టర్ నటరాజ్ సారధ్యంలో వైద్యులు రూ. 40 వేల విలువ గల టెనాక్ట్‌ప్లేస్ ఇంజక్షన్ ఇచ్చారు. సరైన సమయంలో, సరైన ట్రీట్మెంట్ యేసుకు అందడం వల్ల నిమిషాల వ్యవధిలోనే యేసు కోలుకున్నాడు. గోల్డెన్ అవర్‌లో అందాల్సిన వైద్యం అందటం లో నడవలేని, కదల లేని స్థితిలో ఆసుపత్రి కి వచ్చిన యేసు అర గంట వ్యవధి లోనే నడవగలిగే స్థితికి చేరుకున్నాడు. దీంతో యేసుతో పాటు వచ్చిన వారి అమ్మ, వారి కుటుంబ సభ్యుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిపుణులైన వైద్యులు అంకిత భావంతో పని చెయ్యడం వల్లనే అనేక మందిని ప్రాణాపాయం నుంచి కాపాడగలుగుతున్నామని జిజిహెచ్ సూపరెంటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో తక్షణ వైద్యం అందదు అనే అభిప్రాయం ఉండటం సరి కాదని, గోల్డెన్ అవర్‌లో మంచి వైద్యం అందిచడం ద్వారా యేసు కోలుకున్నాడని అయన అన్నారు. సకాలంలో స్పందించి వైద్యం అందించిన న్యూరాలజీ బృందానికి, క్యాజువాలిటీ సిబ్బందికి అభినందనలు తెలిపారు. డాక్టర్ నటరాజ్, డాక్టర్ హరి, డాక్టర్ లక్ష్మి, డాక్టర్ మనీషారెడ్డి, మెడిసిన్ పిజి, రేడియాలజీ డా క్టర్ మౌనికలను అడ్మినిస్ట్రేటర్ అద్దయ్య, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ మాధవీలత అభినందించారు.

# జిల్లాలో గ్యాస్ కొరత లేదు

### 5939 సిలిండర్లు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి

### డిఎస్ఓ జమీర్ బాషా

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, మార్చి 28)

వాణిజ్య అవసరాలకు దృష్టిలో పెట్టుకుని కమర్షియల్ సిలిండర్లను 70 శాతానికి సరఫరా పెంచుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినది జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్ నజీర్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుమూలంగా గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లందరూ వారి పరిధిలోని వాణిజ్య అవసరాలకు సంబంధించిన వినియోగదారులకు సకాలంలో పెంచినటువంటి సిలిండర్లను సప్లై చేయవలసిందిగా ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. పై పట్టణంలోను, గ్రామీణ ప్రాంతాల్లో అయిన సింగిల్ సిలిండర్ ఉన్న వారు 25 రోజుల తర్వాత,డబ్బుల్ సిలిండర్లు ఉన్న వారు 35 రోజుల తర్వాత బుక్ చేసుకోవచ్చునని తెలిపారు. గ్యాస్ బుకింగ్ చేసిన తర్వాత 7 రోజులలోగా సిలిండర్లు వస్తున్నదన్నారు. జిల్లాలోని 27 గ్యాస్ ఏజెన్సీలకు సంబంధించి ప్రత్యేక అధికారులు, పర్యవేక్షణాధికారులుగా నియమించమన్నారు. జిల్లా మరియు డివిజనల్ స్థాయిలో కంట్రోల్ రూములను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వినియోగదారుల అవసరాలకు తగిన విధంగా యల్.పి.జి. గ్యాస్ 5939 సిలిండర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. గ్యాస్ కంపెనీల ద్వారా సరఫరా సాధారణంగానే కొనసాగుతుందని ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గ్యాస్ కొరత వస్తుందనే ఉద్దేశంతో వెంట వెంటనే ఆన్ లైన్‌లో గ్యాస్ బుకింగ్ చేయడానికి వెబ్ పోర్టల్ అనుమతించదని సంక్షేమ వసతి గృహాలు మరియు ఇతర అత్యవసర సేవలకు గ్యాస్ సరఫరాలో ఎలాంటి ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు. అవసరానికి మించి గ్యాస్ సిలిండర్ల ను నిల్వ చేయడం లేదా కొనుగోలు చేయడం చేయరాదన్నారు. ప్రజలు అపోహలను నమ్మకుండా అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలన్నారు. గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్లను (14.21కిలోలు) వాణిజ్య అవసరాల కోసం తరలించిన, వినియోగించిన అట్టి వారిపై నిత్యావసరాల చట్టం 1955, ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్ఓ ఆ ప్రకటనలో తెలిపారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# దళిత క్రిస్టియన్లను ఎస్సీ జాబితాలో చేర్చాలి

## దళిత క్రిస్టియన్లను ఎస్సీలుగా పరిగణించరాదని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పున:సమీక్షించాలి

### రౌండ్ టేబుల్ సమావేశం వక్తలు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 28)**

కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం - ప్రకాశం జిల్లా కమిటి ఆధ్వర్యంలో శనివారం ఎల్బీజీ భవన్ నందు జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలు అంశాలను లేవనెత్తారు. 24-03-2026న దళిత క్రిస్టియన్లను ఎస్సీలను పరిగణించరాదని సుప్రీం కోర్టు ఇచ్చినటువంటి తీర్పును పున: సమీక్షించాలని ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో కోరారు. ఎస్సీ రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేపట్టాలి. సుప్రీంకోర్టు ఎస్సీ రిజర్వేషన్లు , మత మార్పిడి అంశంపై ఇచ్చిన తాజా తీర్పుపై దళిత క్రైస్తవులలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతుందన్నారు. సుప్రీంకోర్టు ఎస్సీ రిజర్వేషన్లపై ఇచ్చిన తీర్పు తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. రిజర్వేషన్లను మతంతో అనుసంధానం చేయడం పూర్తిగా అభ్యంతరకరం. గౌరవ న్యాయస్థానం ఈ తీర్పును వెంటనే రివ్యూ చేయాలని కోరారు. అలాగే కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేసి, మతానికి, రిజర్వేషన్లకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టంగా పేర్కొనాలన్నారు. రిజర్వేషన్లు ఎందుకు వచ్చాయో గుర్తు చేసుకోవాలి. శతాబ్దాలుగా దళితులు ఎదుర్కొంటున్న అంటరానితనం, సామాజిక వివక్ష, ఆర్థిక-విద్యా వెనుకబాటుతనం నుండి బయటపడేందుకు రాజ్యాంగం ప్రత్యేక హక్కుగా రిజర్వేషన్లను కల్పించిందన్నారు. ఇవి మతానికి సంబంధించినవి కాదు; ఇవి సామాజిక న్యాయం సాధించడానికి తీసుకున్న చారిత్రక చర్యలు. మన దేశంలో అందరికీ మత స్వేచ్ఛ ఉంది. ఎవరైనా ఏ మతాన్ని అనుసరించవచ్చు. కానీ అదే స్వేచ్ఛ దళితులకు వర్తించదా? మతం మారితే రిజర్వేషన్లు కోల్పోవాల్సి వస్తుందా? ఇది స్పష్టమైన అన్యాయం. ఒకవైపు మత స్వేచ్ఛను కల్పిస్తూ, మరోవైపు హక్కులను కత్తిరించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. దళితులు ఇతర మతాలలోకి మారితే ఎస్సీ రిజర్వేషన్లు వర్తించవు అనే తీర్పు తీవ్ర అసంతృప్తిని కలిగిస్తోంది. ఈ తీర్పును పున:సమీక్షించాలి. కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని రాజ్యాంగ సవరణ ద్వారా ఈ అన్యాయాన్ని సరిదిద్దాలి. సమాజంలో ఇంకా దళితులపై వివక్ష కొనసాగుతోంది. మతం మార్చుకున్నా ఆ వివక్ష తగ్గదు. కాబట్టి మతాన్ని ఆధారంగా చేసుకుని హక్కులను నిరాకరించడం పూర్తిగా తప్పు. ఈ తీర్పు హిందుత్వ శక్తులకు ఆయుధంగా మారి, దళితులపై దాడులు మరింత పెరగడానికి దారి తీసే ప్రమాదం ఉంది. అంటరానితనాన్ని నిర్మూలించడానికి వచ్చిన రిజర్వేషన్లను బలహీనపరచే ఏ చర్యనైనా అంగీకరించలేం. సామాజిక న్యాయం స్థానంలోకి మనుధర్మాన్ని ప్రోత్సహించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనిపై అన్ని రాజకీయ పార్టీలు స్పందించాలి.ఆంధ్రరాష్ట్ర అసెంబ్లీ ఈ అంశంపై తీర్మానం ఆమోదించి, కేంద్రానికి రాజ్యాంగ సవరణ కోసం పంపాలి.

దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చకపోవడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడింది. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ దళితులను గుడిలోకి అనుమతించని పరిస్థితులు ఉన్నాయి. ఈ కారణంగానే వారు చర్చిలకు వెళ్తున్నారన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వివక్ష కొనసాగుతోంది. దళితులు మతం మార్చుకున్నా వివక్ష పోదు. కాబట్టి సామాజిక న్యాయం సాధించాలంటే కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేసి, దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తున్న నేటికి ఎవ్వరు కూడా అమలు జరపలేదు. ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ఇచ్చిన హామీ ప్రకారం దళిత క్రైస్తవులను ఎస్ సి జాబితాలో చేరుస్తూ రాజ్యాంగ సవరణ చేయాలి.







**డిమాండ్లు :**

సుప్రీంకోర్టు తీర్పును వెంటనే రివ్యూ చేయాలి. మతానికి రిజర్వేషన్లకు సంబంధం లేకుండా కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేయాలి. దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలి. రౌండ్ టేబుల్ సమావేశానికి కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి రఘురామ్ అధ్యక్షత వహించారు. ఈ యొక్క కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షులు ప్రతి ప్రకాశం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు బిల్లా చెన్నయ్య కోర్స్ అధ్యక్షులు సిహెచ్ సుధీర్ బాబు ఐ ఎల్ పి నాయకులు దాసరి సుందరం సిఐటియు జిల్లా కార్యదర్శి జి శ్రీనివాసులు, ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి ,ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరాస్వామి, బాలల సంఘం నాయకుడు సిహెచ్ వినోద్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ,యు వెంకటేశ్వర్లు జాలాది, మోహన, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వి మోజేష్ ,టి రామారావు ఈ యొక్క కార్యక్రమాన్ని వందన సమర్పణ, కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు అట్లూరి రాఘవులు ,వందన సమర్పణ చేశారు. పలు అంశాలను తీర్మానాలుగా రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానించారు.

# రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

## కరణం వెంకటేష్




**(షణ్ముఖ వెలుగు, చీరాల, మార్చి 28)**

మండలంలోని రామకృష్ణాపురం క్యాంపు కార్యాలయం నందు వైయస్సార్ పార్టీ సమన్వయకర్త కరణం వెంకటేష్ బాబు ఆధ్వర్యంలో శనివారం పట్టణ బూత్ కమిటీ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కరణం వెంకటేష్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను బూత్ కమిటీ కన్వీనర్లు ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా ఇప్పటి నుంచే కార్యాచరణ చేపట్టాలని ఆయన దిశా, నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు, బూత్ కమిటీ కన్వీనర్లు పాల్గొన్నారు.

# బద్దిపూడి గ్రామ సచివాలయం భవనంకి వాటర్ ఫ్రీజర్ బహూకరణ





**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మార్చి 28)**

మండలంలోని బద్దిపూడి గ్రామ సచివాలయంకి వాటర్ ఫ్రీజర్‌ను రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసులు వారి తల్లిదండ్రులైన మాజీ సర్పంచ్ స్వర్గీయ బల్లికూర రమణయ్య, సీతారావమ్మ జ్ఞాపకార్థం రూ.10,500 విలువ చేసే మంచి నీటి వాటర్ ఫ్రీజర్ ను బహుకరించారు. సోదరుడు బి గోపీనాథ్ కూడా హాజరు అయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ వేసవి కాలములో సచివాలయంకి కార్యాలయ పనుల నిమిత్తం వచ్చే గ్రామ ప్రజలకు, సచివాలయ అధికారులకు చాలా అవసరమని సచివాలయ అభివృద్ధి అధికారి విన్నపం మేరకు ఈ కార్యక్రమం చేసినట్లు తెలిపారు. ఇదే విధంగా తమ కుటుంబం తరుపున గతములో కూడా గ్రామంలో ఉన్న రెండు ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు పలు సందర్భాల్లో విద్యకు అవసరమైన పలు రకాల స్టడీ మెటీరియల్స్ ను అందించినట్లు తెలిపారు. జన్మ నిచ్చిన తల్లిదండ్రులను స్మరించుకుంటూ తాము పుట్టి పెరిగిన గ్రామానికి ఈ విధంగా చేయడం మా బాధ్యత అని ఇది మాకు సంతృప్తి ని ఇస్తుందని తెలిపారు. దాతలకు గ్రామ అభివృద్ధి అధికారి తిరుపతమ్మ గారు ధన్యవాదాలు తెలిపి చిరు సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది రామకోటయ్య, శశిధర్, రసూల్, నాగరాణి, గ్రామస్తులు దమ్ము వెంకయ్య, తుమ్మల నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణాన్ని కాపాడుకుందాం

## స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించిన ప్రకాశం పోలీసులు






**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 28)**

ప్రతి నెల మూడో శనివారం పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మార్చి నెల థీమ్ “ప్లాస్టిక్ రహిత జీవనమే.. స్వచ్ఛ ఆంధ్ర సాధనకు పునాది నినాదంతో ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు అన్ని పోలీస్ స్టేషన్ లో, జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులు మరియు సిబ్బంది కలిసి స్వచ్ఛత, శుభ్రత కార్యక్రమాలు చేపట్టి, ప్రతిజ్ఞ ను కూడా చేశారు. పోలీస్ కార్యాలయ ఆవరణను శుభ్రం చేయడంతో పాటు చుట్టుపక్కల చెత్తను తొలగించి, పిచ్చి మొక్కలను గుణపం, పారలతో తీసివేశారు. ఇలా శుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ, పర్యావరణ పరిరక్షణకు తమ పాత్రను పోషించారు. పర్యావరణాన్ని కలుషితం చేసే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలనీ, ఒక్కసారి ఉపయోగించి పారేస్తున్న ప్లాస్టిక్ వస్తువులు ఏళ్ల పాటు ప్రకృతిలో కరుగకుండా ఉండి, మానవజాతికి, వన్యప్రాణులకు, సముద్ర జీవరాశికి ముప్పుగా మారుతున్నాయని, ఈ విషయంలో ప్రతీ ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని,మన చుట్టూ ఉండే పరిసరాలను శుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని ఎఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. మనం తీసుకునే చర్యలు రేపటి తరాల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయని గుర్తించి, పరిశుభ్రతపై మనం చూపే శ్రద్ధ వారికి మంచి జీవన వాతావరణాన్ని అందించడంలో కీలకమవుతుందన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచే విధంగా ఈ కార్యక్రమం చేపట్టారు. మన చుట్టుపక్కల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆహ్లాదకరమైన, ప్రశాంతమైన వాతావరణం నెలకొంటుందని అందువలన మనసు ప్రశాంతతతో కూడి ఆరోగ్యకర వాతావరణంలో, క్రమశిక్షణగా విధులు నిర్వర్తించొచ్చు.





# డీఎన్ఏ నంబర్స్ ప్రకారం మృతదేహాలు అప్పగింత









**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మార్చి 28)**

మార్కాపురంలోని రాయవరం దగ్గర జరిగిన బస్సు ప్రమాద మృతదేహాల డిఎన్ఏ నెంబర్స్ ప్రకారం మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అధికారులు అప్పగించారు. జిజిహెచ్‌లో ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసి స్వగ్రామాలకు మృతదేహాల తరలించారు. పోలీస్ బందోబస్తు నడుమ కుటుంబ సభ్యులకు మృతదేహాలను అధికారులు అప్పగించారు. దీంతో మృతుల కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు వేడుకున్నారు.